PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ

ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 42 సంచిక : 113 | విజయవాడ, గురువారం 24 నవంబర్ 2022 | 6 + 8 పేజీలు వెల : 5. 50
Vol No | Vijayawada, Thursday 24 November 2022 | Rs

20 మంది ఎఎన్‌ఎంలకు ఎస్‌పిలుగా ప్రమోషన్
● లోపలి పేజీలో..●


● లోపలి పేజీలో..●

సౌదీ అరేబియా జట్టు అర్జెంటీనాకు ఝలక్ ఇచ్చి 24గంటలు గడవకముందే.. ఫిఫా ప్రపంచకప్‌లో మరో సంచలనం నమోదైంది. బుధవారం జరిగిన గ్రూప్-ఇ లీగ్ మ్యాచ్‌లో ఆసియా ఖండానికే చెందిన జపాన్ జట్టు నాలుగుసార్లు ఫిఫా టైటిల్ విజేత జర్మనీ జట్టును 2-1తో ఓడించి పెను సంచలనానికి తెరలేపింది.

భూ వివాదాలు లేకుండా
రికార్డుల ప్రక్షాళన


వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పత్రాల పంపిణీ ప్రారంభ సభలో సిఎం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

రాష్ట్రంలో భూ వివాదాలకు తావులేకుండా భూ సమగ్ర సర్వేతో రికార్డులను ప్రక్షాళన చేస్తున్నామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష (రీ సర్వే) పత్రాల పంపిణీ ప్రారంభ కార్యక్రమంలో భాగంగా శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో బుధవారం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. మొదటి దశలో రెండు వేల రెవెన్యూ గ్రామాల్లో సర్వే, రికార్డులను ప్రక్షాళన పూర్తి చేశామని, మరో 15 రోజుల్లో భూ హక్కు పత్రాలను పంపిణీ చేస్తామని వెల్లడించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో నాలుగు వేల గ్రామాలు, పట్టణాలు, మేలో ఆరు వేలు, ఆగస్టులో తొమ్మిది వేల గ్రామాలు, పట్టణాల్లో సర్వే చేస్తామని తెలిపారు. రాష్ట్రంలోని 17,584 రెవెన్యూ గ్రామాల్లోనూ వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి ఈ ప్రక్రియను పూర్తి చేస్తామన్నారు. రాష్ట్రంలో నమోదైన సివిల్ కేసుల్లో 80 నుంచి 90 శాతం కేసులు భూ వివాదాలకు సంబధించినవేనని ఉన్నాయంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో చెప్పాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితులు మారితేనే మన రాష్ట్రంలో కష్టపడి సంపాదించిన ఆస్తి, వారసత్వంగా వచ్చిన సంపదకు రక్షణ ఉంటుందన్నారు. భూ రికార్డులను ప్రక్షాళన చేసే సరైన వ్యవస్థ లేకపోవడం, రికార్డులు టాంపరింగ్ చేసే పరిస్థితులు, అమ్మిన తర్వాత సబ్‌డివిజన్లు కాకపోవడం, మ్యుటేషన్‌లు జరగకపోవడం, ఇతర కారణాలతో తమ భూమి చేజారిపోయే పరిస్థితి ఎవరికన్నా వస్తే అంతకన్నా బాధాకరమైన విషయం మరొకటి ఉండదని పేర్కొన్నారు.

జానెడు భూమిలోనూ తప్పు జరగనీయం

సివిల్ వివాదాలకు ఆస్కారం ఉండకూడదనే భూ


నమూనా భూ హక్కు పత్రాలను పంపిణీ చేస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి

సమగ్ర సర్వేకు శ్రీకారం చుట్టామని జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. భూ కమతం ఒక సర్వే నంబరుతో ఉండి కాలక్రమంలో విభజన జరిగినా, మారినా సర్వే రికార్డులు అప్‌డేట్ కాకపోవడం వల్ల వస్తున్న వివాధాలన్నింటికీ భూ సమగ్ర సర్వేతో స్వస్తి పలికినట్లవుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో కోట్ల ఎకరాలకు సంబంధించిన సాగు, ఇతర భూములకు సంబంధించి ఒక జానెడు కూడా తప్పు జరగకుండా పూర్తిగా సర్వే చేయిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 17 వేలపైచిలుకు రెవెన్యూ గ్రామాల్లో 1.07 కోట్ల రైతులు, 2.47 కోట్ల సర్వే నంబర్లకు సంబంధించి 2.26 కోట్ల ఎకరాల వ్యవసాయ భూముల సర్వే చేపడుతున్నామన్నారు.

సర్వేయర్లతో సబ్ రిజిస్ట్రార్ సేవలు

గ్రామ సర్వేయర్ల ద్వారానే గ్రామంలోని సచివాలయంలో సబ్ రిజిస్ట్రార్ సేవలను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. ఇకపై సర్వేయర్లు సరిహద్దులు మార్కింగ్ చేసే ఫీల్డ్ లైన్ దరఖాస్తులు 15 రోజుల్లోనూ, పట్టా సబ్ డివిజన్, మ్యుటేషన్ దరఖాస్తులు 30 రోజుల్లోనూ కచ్చితంగా పరిష్కారించాల్సి ఉంటుందన్నారు. సచివాలయాల్లో గ్రేడ్-3 కేటగిరీలో పనిచేస్తున్న సర్వేయర్లను గ్రేడ్-2గా మార్చనున్నామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 11 వేల గ్రామ సచివాలయాల్లో ఇకపై భూములు, ఆస్తుల అమ్మకాలు, కొనుగోలు రిజిస్ట్రేషన్ కార్యాలయాలుగా మారుస్తున్నామని తెలిపారు.

చంద్రబాబుపై తీవ్ర విమర్శలు

సొంత మామను, ఆ మామ పెట్టిన పార్టీని, ట్రస్టును, చివరికి ఆ మామకు ప్రజలు ఇచ్చిన సిఎం కుర్చీనీ వెన్నుపోటు పొడిచి కబ్జా చేసే వాళ్లను ఏమంటారు? చంద్రబాబు అని అంటారని జగన్మోహన్‌రెడ్డి విమర్శించారు. ఎన్నికలప్పుడు ప్రజలకు మాయమాటలు చెప్పి, ఆ తర్వాత ప్రజలను గాలికొదిలేసి మోసం చేసిన చంద్రబాబును సమర్థిస్తున్న వారిని దుష్ట చతుష్టయమని అనాలా? వద్దా?, వారిని రాక్షస మూకలని అనాలా? వద్దా? అని ఆలోచన చేయాలన్నారు. అబద్దాలు నమ్మొద్దని, ప్రభుత్వం చేస్తున్న మంచినే కొలమానంగా తీసుకుని అండగా నిలవాలని కోరారు. అనంతరం పలువురు రైతులకు భూ హక్కు పత్రాలను అందించారు. శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం, మంత్రులు బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు, ల్యాండ్ సర్వే డైరెక్టర్ మిగతా 5లో

తప్పు చేస్తే ప్రధానినైనా ఉపేక్షించరాదు

● సిఇసికి ఆ సత్తా ఉండాలి : సుప్రీం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

తప్పు చేస్తే ప్రధాన మంత్రిపై సైతం చర్యలు తీసుకునేంత సత్తా ఉన్న ప్రధాన ఎన్నికల కమిషనర్ దేశానికి అవసరమని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. రాజకీయాలతో సంబంధం లేని వ్యక్తుల ఎంపిక సరైందని పేర్కొంది. కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్ల నియామకానికి ప్రస్తుతం నడుస్తున్న వ్యవస్థ సరికాదని, కొలీజియం లాంటి వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై బుధవారం జస్టిస్ కెఎం జోసెఫ్, జస్టిస్ అజయ్ రస్తోగి, జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ హృషికేశ్ రాయ్, జస్టిస్ సిటి రవి కుమార్‌లతో కూడిన సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం విచారించింది. "ప్రధానికి వ్యతిరేకంగా ఆరోపణలు వచ్చాయనుకుందాం. సిఇసి చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. సిఇసి బలహీనంగా ఉంటే ఎలాంటి చర్యలు తీసుకోలేరు కదా" అని ధర్మాసనం పేర్కొంది. "సిఇసి ఉన్నత స్థానం రాజకీయ ప్రభావం నుంచి రక్షించబడాలి. స్వతంత్రంగా ఉండాలి. కానీ అలా జరగడం లేదు. ఇది పూర్తిగా వ్యవస్థ విచ్ఛిన్నం కాదా?" అని అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణిని ప్రశ్నించింది. కేంద్ర మంత్రివర్గం సలహా మేరకు ఎన్నికల కమిషనర్లను రాష్ట్రపతి నియమించాలని రాజ్యాంగంలో ఉందని, ఇంతవరకు అదే అమలవుతోందని ఆర్.వెంకటరమణి తెలిపారు. జస్టిస్ అజయ్ రస్తోగి జోక్యం చేసుకొని ఇసి నియామకంలో ప్రజలు ప్రశ్నించకుండా ఉండేలా పారదర్శకమైన యంత్రాంగం ఉండాలని అన్నారు. రిటైర్డ్ సివిల్ సర్వెంట్ అరుణ్ గోయల్‌ను ఎన్నికల కమిషనర్‌గా ఇటీవల నియమించిన ఫైల్‌ను సమర్పించాలని ధర్మాసనం కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. సిఇసికి నియామకాలపై స్టే విధించాలని కోరుతూ దాఖలైన మధ్యంతర దరఖాస్తు పెండింగ్‌లో ఉన్నందున ఈ నియామకం ఎలా జరుగుతుందని ప్రశ్నించింది. గురువారం ఫైల్ తీసుకురావాలని ఏజిని కోరింది.


జంతర్ మంతర్ వద్ద ధర్నాలో మాట్లాడుతున్న ఎలమారం కరీం

విద్యుత్ బిల్లును ఉపసంహరించకపోతే
దేశవ్యాప్త సమ్మె

'నేషనల్ కోఆర్డినేషన్ కమిటీ' ప్రకటన

ప్రతిఘటన తప్పదు : ధర్నాలో ఎలమారం కరీం


ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

విద్యుత్ రంగాన్ని ప్రైవేటుకు కట్టబట్టే సవరణ బిల్లును తక్షణం ఉపసంహరించుకోవాలని నేషనల్ కోఆర్డినేషన్ కమిటీ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ అండ్ ఇంజనీర్స్ (ఎన్‌సిసిఒఇఇఇ) డిమాండ్ చేసింది. తమ విజ్ఞప్తిని కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోతే దేశ వ్యాప్తంగా సమ్మెకు దిగుతామని హెచ్చరించింది. ఆ కమిటీ ఆధ్వర్యంలో వివిధ రాష్ట్రాల నుండి తరలివచ్చిన విద్యుత్ ఉద్యోగులు, ఇంజినీర్లు బుధవారం పార్లమెంటు మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జంతర్‌మంతర్ వద్ద జరిగిన ధర్నాలో విద్యుత్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని. ప్రైవేటీకరణ ప్రక్రియను నిలిపివేయాలని కోరారు. విద్యుత్ వినియోగదారుల, విద్యుత్ వ్యవస్థ ప్రయోజనాల కోసం అన్ని రాష్ట్రాల, కేంద్ర పాలిత ప్రాంతాల ముఖ్యమంత్రులు విద్యుత్ సవరణ బిల్లును వ్యతిరేకించాలని ఎన్‌సిసిఒఇఇఇ కోరింది. కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్దీకరించాలని, విద్యుత్ బిల్లును ఉపసంహరించాలంటూ వారు చేసిన డిమాండ్లతో ఆ ప్రాంతం మారుమ్రోగింది. విద్యుత్ ఉద్యోగుల ఆందోళనకు మద్దతు తెలిపిన సిఐటియు జాతీయ కార్యదర్శి, రాజ్యసభ ఎంపీ ఎలమారం కరీం మాట్లాడుతూ మోడీ సర్కార్ అధికారంలోకి వచ్చిన తరువాత నేల నుంచి నింగి వరకు అన్నీ ప్రైవేటీకరణ చేస్తోందన్నారు. దేశ సంపదను కార్పొరేట్లు లూటీ చేస్తున్నారని, అందుకునుగుణంగా ప్రభుత్వం విధానాల రూపకల్పన చేస్తున్నదని అన్నారు. కేరళలో విద్యుత్ బోర్డును ప్రభుత్వమే ఒక కంపెనీగా నిర్వహిస్తోందని తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లో విద్యుత్ రంగ ప్రయివేటీకరణను అక్కడి ఉద్యోగులు, కార్మికులు, ఇంజనీర్లు పోరాడి తిప్పికొట్టారని గుర్తు చేశారు. ఇటీవల జమ్మూకాశ్మీర్, పుదుచ్చేరి, చండీగఢ్‌లో కేంద్ర ప్రభుత్వం అక్కడి విద్యుత్ వ్యవస్థను ప్రైవేటీకరణ చేయాలని చూస్తే, కార్మికులు, ఉద్యోగులు, ఇంజనీర్లు ఐక్యంగా పోరాడి విజయం సాధించారని తెలిపారు. గతంలో మిగతా 5లో

విభజన సమస్యలపై
ఎటూ తేల్చని సమావేశం

2024లోపు ఉమ్మడి సమస్యలు పరిష్కరించాలని సిఎస్ విజ్ఞప్తి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



విభజన సమస్యల పరిష్కారం కోసం కేంద్ర క్యాబినెట్ సెక్రటరీతో జరిగిన సమావేశంలో అసంపూర్తిగానే ముగిసింది. విభజన సమస్యలపై సిఎస్ ఆధ్వర్యాన అధికారుల బృందం బుధవారం కేంద్ర క్యాబినెట్ సెక్రటరీతో సమావేశమైంది. ఈ సందర్భంగా రాష్ట్రానికి ఇవ్వాల్సిన పలు అంశాలపై సిఎస్ డాక్టర్ సమీర్‌శర్మ క్యాబనెట్ సెక్రటరీకి వివరించారు. ముఖ్యంగా పోలవరం ప్రాజెక్టు నిధులు మంజూరు చేయాలని కోరారు. ప్రాజెక్టు ఆర్థిక వివరాలను కార్యదర్శికి సమర్పించినట్లు తెలిసింది. వీటిని పరిశీలించి నిధుల విడుదలలో జాప్యం లేకుండా చూడాలని కోరినట్లు సమాచారం. విశాఖపట్నం రైల్వేజోన్, రామాయ పట్నం ఓడరేవు, కడప స్టీలు ప్లాంటు ప్రతిపాదనలను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని కోరినట్లు తెలిసింది. విభజన చట్టంలోని షెడ్యూలు 9, 10లో పేర్కొన్న సంస్థలకు సంబంధించిన ఆస్తుల విభజన,ఆర్థిక వ్యవహారాలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయని తెలిపినట్లు సమాచారం. ముఖ్యంగా తెలంగాణా నుండి రావాల్సిన విద్యుత్ బిల్లుల అంశాన్ని సిఎస్ లేవనెత్తారు. చట్టంలో పేర్కొన్న విధంగా పదేళ్లు గడవకముందే రెండు రాష్ట్రాల మధ్య ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. హైదరాబాద్ ఉమ్మడి రాజధాని గడువు జూన్ 2, 2024 నాటికి ముగియనుందని, అప్పటి నుండి తెలంగాణా రాజధానిగా మారుతుందని, అప్పట్లోపు సమస్యలన్నీ పరిష్కరించే విధంగా చూడాలని కోరినట్లు సమాచారం. విభజన సమస్యలపై రెండు తెలుగు రాష్ట్రాల అధికారులతో చర్చించి వీలైనంత త్వరగా పరిష్కారం చూపాలని సిఎస్ కేంద్రాన్ని కోరారని సమాచారం.

నయా ఉదారవాద విధానాల వల్లే
సంక్షోభంలో వ్యవసాయం

● వ్యవసాయ, సహకార రంగాలపై కేంద్రం పెత్తనం ● కేంద్ర సహకార శాఖకు అమిత్ షా మంత్రా?

● రాష్ట్రంలో వ్యవసాయ వ్యతిరేక విధానాలను జగన్ మానుకోవాలి : ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

● ఎపిపై అదానీ 'అశ్వమేధయాగం' : వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

కేంద్రంలో 2014 నుంచి అధికారంలో ఉన్న బిజెపి సర్కారు అనుసరిస్తున్న వ్యవసాయ, సహకార వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాల వల్లే రైతాంగ ఆత్మహత్యలు పెరుగుతున్నాయని గుంటూరు, కృష్ణా జిల్లాల ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. 'వ్యవసాయ రంగం-సహకార సంఘాల పాత్ర' అనే అంశంపై ఎపి రైతు సంఘం-అల్లూరి విజ్ఞాన కేంద్రం సంయుక్తంగా బుధవారం విశాఖలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన ఉత్తరాంధ్ర స్థాయి సెమినార్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో భారీ నీటి ప్రాజెక్టులతో వ్యవసాయ రంగానికి ఒక ఊపు వచ్చిందన్నారు. 1990లో ప్రధాని పివి.నరసింహారావు హయాం నుంచి అమలైన నయా ఉదారవాద విధానాలు వ్యవసాయ, సహకార రంగాల పాలిట శాపంగా


సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు

మారాయని అన్నారు. సహకార రంగంపై కేంద్రంలో ఒక శాఖ ఏర్పాటు చేసి దానికి అమిత్ షాను మంత్రిగా చేయడమంటే వ్యవసాయ, సహకార రంగాలను కార్పొరేటీకరణ చేస్తున్నారనడానికి సంకేతమని పేర్కొన్నారు. 2014లో మోడీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ పూర్తిగా కార్పొరేట్ అనుకూల విధానాలతో వ్యవసాయ రంగం సంక్షోభంలోకి కూరుకుపోయి దేశంలో మిగతా 5లో



27న ఐఐఐటి తుది దశ
కౌన్సిలింగ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్(ఆర్‌జియుకెటి)లో ఐఐఐటి ప్రవేశాలకు ఈ నెల 27న తుది దశ కౌన్సిలింగ్ జరగనుందని యూనివర్సిటీ కులపతి కెసి రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022-2023 విద్యా సంవత్సరానికి ఎంపికైన, వెయిటింగ్ అభ్యర్థుల జాబితాను యూనివర్సిటీ వెబ్‌సైట్ www.rgukt.inలో పొందుపరిచినట్లు పేర్కొన్నారు. అభ్యర్థులకు మొబైల్, ఈమెయిల్‌కు యూనివర్సిటీ తరపున కాల్‌లెటర్లు పంపామని తెలిపారు. అభ్యర్థులు అన్ని సర్టిఫికెట్లతో ఉదయం ఎనిమిది గంటలలోపు కౌన్సిలింగ్‌కు హాజరుకావాలని వెల్లడించారు.

రాజధానిలో పేదల పరిస్థితి ఏమిటి?

- కమిషనర్‌ను ప్రశ్నించిన రైతులు
- భవిష్యత్‌లో వచ్చేవారికి ఇళ్ల స్థలాలు ఎక్కడ ఇస్తారు
- సిఆర్‌డిఎలో ముగిసిన విచారణ


కమిషనర్‌తో మాట్లాడుతున్న రాజధాని ప్రాంత రైతులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని పరిధిలో భూములను ఇతరులకు కేటాయిస్తే భవిష్యత్‌లో ఇక్కడకు ఉపాధి, ఉద్యోగాల కోసం వచ్చే వారికి ఇళ్లస్థలాలు ఎక్కడ కేటాయిస్తారని రైతులు సిఆర్‌డిఏ కమిషనర్‌ను ప్రశ్నించారు. దీనివల్ల భవిష్యత్‌లో భూముల సమస్య ఏర్పడుతుందని తెలిపారు. రాజధాని ఏర్పాటు నాటికి 29 గ్రామాల్లో ఉన్న భూమిలేని పేదలకు ఇళ్లస్థలాలు ఇవ్వడమూ కష్టవుతుందని వివరించారు. పేదలకు ఇళ్ల స్థలాలకు ఇవ్వాలనే పేరుతో ఏర్పాటు చేసిన ఆర్-5జోన్‌పై అభ్యంతరాలు వ్యక్తం చేసిన రైతులతో సిఆర్‌డిఎ నిర్వహించిన విచారణ నేటితో ముగిసింది. ఈ సందర్భంగా రైతులు తమ అభిప్రాయాలు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. గతంలో ఏర్పాటు చేసిన రాజధాని మస్టార్‌ప్లాను 2050 వరకూ అమల్లో ఉండే విధంగా రూపొందించారని, అక్కడున్న సుమారు 53 వేల ఎకరాల భూములను కాలక్రమంలో అభివృద్ధి చేసే విధంగానూ ప్లాను ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ క్రమంలో సుమారు లక్షన్నర మంది ప్రజలు ఇక్కడకు వస్తారని అంచనా వేశారని, ఇక్కడ ఉపాధి కోల్పోయినవారికి, ఇళ్లస్థలాలు లేనివారికి ఇళ్లు నిర్మించి ఇచ్చేందుకు ఇప్పటి నుండి రాబోయే 30 ఏళ్లకు అవసరమయ్యే విధంగా 2500 ఎకరాలు కేటాయించారని చెప్పారు. నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్-5 జోన్‌కు తొలిదశలోనే 900 ఎకరాలు కేటాయించారని, మిగిలిన 30 ఏళ్లలో ఇక్కడకు వచ్చేవారందరికీ ఇవ్వాలంటే మొత్తం రాజధాని అంతా ఇళ్లస్థలాలకే సరిపోతుందని తెలిపారు. ఇక అభివృద్ధి ఎక్కడని రైతులు కమిషనర్‌ను నిలదీశారు. రాజధాని ప్రాంతంలో యువత అభివృద్ధి కోసం స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా శిక్షణ ఇస్తామని చెప్పినా సరైన శిక్షణ లేకపోవడంతో యువత ఆసక్తి చూపలేదని వివరించారు. రాజధానిలో 365 రోజులూ ఉపాధి హామీ పథకం కింద పని కల్పించాలని టిడిపి ప్రభుత్వం నిర్ణయించిందని, ప్రస్తుతం అమలు చేయడం లేదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రాజధాని అభివృద్ధి చెందక ముందే భూములను ఇతరులకు కేటాయించడం ద్వారా భవిష్యత్‌లో ఇబ్బందులు ఏర్పడతాయని రైతులు కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. బుధవారం నాటికి సుమారు 15 వేలమందికి పైబడి రైతులు తమ అభిప్రాయాలను సిఆర్‌డిఏ అధికారులకు తెలిపారు.

వర్జీనియా వాల్‌మార్ట్ స్టోర్‌లో
కాల్పులు

● ఆరుగురు మృతి

చెసాపీక్ (వర్జీనియా) : వర్జీనియా రాష్ట్రంలోని వాల్‌మార్ట్ స్టోర్‌లో మంగళవారం రాత్రి కాల్పులు జరిగాయి. గురువారం థేంక్స్‌గివింగ్ హాలిడే షాపింగ్ కోసం వచ్చిన వారితో స్టోర్ అంతా రద్దీగా వున్న సమయంలో వాల్‌మార్ట్ ఉద్యోగే ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. ఆరుగురిని హతమార్చిన తర్వాత తనను తాను కాల్చుకుని చనిపోయాడని పోలీసులు తెలిపారు. నాలుగు రోజుల కాలంలో ఇది రెండో సంఘటన. గాయపడిన నలుగురిని ఆస్పత్రిలో చేర్చినట్లు చెసాపీక్ పోలీసు చీఫ్ మార్క్ సోలెస్కీ తెలిపారు. ఈ కాల్పుల వెనక గల కారణమేంటన్నది వెంటనే తెలియరాలేదని పత్రికా సమావేశంలో ఆయన చెప్పారు. ఈనెల 13న వర్జీనియా వర్శిటీ విద్యార్థులు ముగ్గురిపై వారి సహ విద్యార్థే కాల్పులు జరిపి హత్య చేశాడు. తాజా సంఘటన పట్ల దిగ్భ్రాంతి చెందామని, తమ సిబ్బందికి తోడ్పాటుగా నిలుస్తామని వాల్‌మార్ట్ యాజమాన్యం ప్రకటించింది.

సంతోష్‌కు మెయిల్ ద్వారా నోటీసులివ్వండి

- సిట్‌కు తెలంగాణ హైకోర్టు ఆదేశం
- ఎ1 రామచంద్రభారతిపై మరో కేసు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

టిఆర్‌ఎస్ ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి బి.ఎల్.సంతోష్‌కు మెయిల్ ద్వారా 41 సిఆర్‌పిసి నోటీసులు అందజేయాలని హైకోర్టు సిట్‌కు సూచించింది. సంతోష్ విచారణకు హాజరయ్యేలా చూడాల్సిన బాధ్యత పిటిషనర్‌పై ఉందని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారంలో సంతోష్‌ను కీలకంగా గుర్తించిన సిట్.. ఈ నెల 21న విచారణకు హాజరు కావాలని నోటీసులు పంపింది. సంతోష్ స్పందించకపోవడంతో సిట్ అధికారులు హైకోర్టును ఆశ్రయించారు. ఆ పిటిషన్‌ను జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం బుధవారం విచారించింది. ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారంలో నిందితులు పలుమార్లు సంతోష్ పేరు ప్రస్తావించారని, పోలీసు విచారణలో కూడా అదే తేలిందని అడ్వకేట్ జనరల్ (ఎజి) బిఎస్ ప్రసాద్ కోర్టుకు తెలిపారు. బిఎల్ సంతోష్‌ను విచారిస్తే కేసుకు సంబంధించిన కీలక విషయాలు వెల్లడయ్యే అవకాశం ఉందని, ఆయనను సిట్ ముందు హాజరయ్యేలా ఆదేశాలు ఇవ్వాలని కోర్టును ఎజి కోరారు. నిర్దేశించిన తేదీతో కూడిన మరో 41ఎ సిఆర్‌పిసి నోటీసు జారీ చేసేలా ఉత్తర్వులు ఇవ్వాలని ఎజి కోర్టును కోరారు. వాదనలు విన్న న్యాయస్థానం.. సంతోష్‌కు మరోసారి 41 సిఆర్‌పిసి కింద ఈ మెయిల్ ద్వారా నోటీసులు జారీ చేయాలని సిట్ అధికారులను ఆదేశించింది. సంతోష్‌ను అరెస్టు చేయొద్దని హైకోర్టు ఇచ్చిన స్టేను ఎత్తివేయాలన్న ఎజి వినతిని కోర్టు నిరాకరించింది. తదుపరి విచారణ ఈ నెల 30కి వాయిదా వేసింది. ఇదే కేసులో నోటీసులు అందుకున్న నిందితుడు నందకుమార్ భార్య చిత్రలేఖ, అంబర్‌పేటకు చెందిన న్యాయవాది ప్రతాప్ గౌడ్‌లు బుధవారం సిట్ ముందు విచారణకు హాజరయ్యారు. ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో ఎ1 నిందితుడు రామచంద్రభారతిపై బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం మరో కేసు నమోదైంది.

అల్పపీడనంతో ముసురువాన

- పిడుగుపాటుకు ఒకరు మృతి

ప్రజాశక్తి - యంత్రాంగం

అల్పపీడనం ప్రభావంతో బుధవారం తిరుపతి, నెల్లూరు జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడ్డాయి. పిడుగుపాటుకు ఒకరు మృతి చెందారు. తిరుపతి జిల్లా వెంకటగిరి, బాలాయపల్లి, డక్కిలి మండలాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దీంతో ఆయా ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాలు, రోడ్లు పూర్తిగా జలమయమయ్యాయి. డ్రెయినేజీలు, కాలువలు పొంగి పొర్లుతుండటంతో స్థానికులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. శ్రీవారి ఆలయ ప్రాంతంతో పాటు మాడవీధులు, కాటేజీలు, రోడ్లు, పార్కులు జలమయమయ్యాయి. చిన్నపిల్లలు, వృద్ధులతో వచ్చిన భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మరోవైపు చలి తీవ్రత కొనసాగుతోంది. నెల్లూరు జిల్లాలో రెండు రోజులుగా కురుస్తోన్న వర్షాలతో కోవూరు, బుజబుజనెల్లూరు, కసుమూరు, వింజమూరు, ఆత్మకూరు, కొడవలూరు, అల్లూరు, విడవలూరు చెరువులు నిండాయి. పిడుగు పాటుకు నెల్లూరు రూరల్ మండలం సౌత్‌మోపూరు గ్రామం బిసి కాలనీకి చెందిన మక్కిన గోవర్ధన్ (40) మృతి చెందాడు. పశువులు మోపుతుండగా ఆయనకు సమీపంలో పిడుగుపడటంతో ఈ ఘటన చోటుచేసుకుంది. అదే మండలంలోని పొట్టేపాలెం గ్రామానికి చెందిన కందల ధనమ్మ పెన్నానది ఒడ్డున పశువులు మేపుతుండగా పిడుగు పడటంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి.

ట్రాన్స్‌జెండర్ల రక్షణ సెల్ ఏర్పాటు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు రాష్ట్రంలో ట్రాన్స్‌జండర్ల భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ట్రాన్స్‌జండర్ ప్రొటెక్షన్ సెల్‌ను ఏర్పాటు చేసింది. మంగళగిరిలోని పోలీస్‌హెడ్ క్వార్టర్స్‌లో సిఐడి చీఫ్ పివి సునీల్‌కుమార్ ట్రాన్స్‌జండర్లతో కలసి ఈ సెల్‌ను ప్రారంభించారు.

ఈ సందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ ట్రాన్స్‌జండర్లకూ ప్రత్యేక హక్కులు, రక్షణ వ్యవస్థ వుండాలని, వారి సంక్షేమం కోసం ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టాలని 2019లో సుప్రీంకోర్టు సూచన మేరకు కేంద్రప్రభుత్వం ట్రాన్స్‌జండర్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను తీసుకువచ్చిందని, విద్య, ఉపాధి అవకాశాలల్లోనూ ప్రాధాన్యతను కల్పించాలని చట్టం చెబుతోందని తెలిపారు. ఈసెల్‌కు ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ ఎస్‌పి కెజివి సరిత నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని అన్నారు. ప్రతి జిల్లాలో ఈ ఈ చట్టంపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్‌పి కెజివి సరిత మాట్లాడుతూ ట్రాన్స్‌జండర్లు పోలీస్ స్టేషన్‌కు వస్తే వారిని అగౌరపరిచేలా కాకుండా గౌరవించి సమస్యకు పరిష్కారం చూపాలని అన్నారు. వికలాంగ, వయోవృద్ధ సంక్షేమశాఖ డైరెక్టర్ ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో 28 వేల మంది ట్రాన్స్‌జండర్లను గుర్తించామని, వారందరికీ నెలకు రూ.3000 చొప్పున పెన్షన్ అందిస్తున్నామని తెలిపారు. వీరిలో 3800 మంది ఓటుహక్కునూ పొందారని మిగిలిన వారికి ఓటు హక్కును కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఫుడ్ ప్రాసెసింగ్‌లో ఆన్‌లైన్ కోర్సులు

- 1 నుంచి ప్రారంభిస్తామన్న సిఇఓ శ్రీధర్‌రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఫుడ్ ప్రాసెసింగ్‌లో ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్‌పై డిసెంబరు ఒకటోతేదీ నుంచి ఆన్‌లైన్ కోర్సులు ప్రారంభిస్తున్నట్లు ఎపి ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ సిఇఓ ఎల్.శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సును ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు, మహిళలు, యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఫ్యాప్సీ(ఎఫ్‌ఎపిసిసిఐ)-ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో ఫుడ్ ప్రాసెసింగ్‌లో ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్‌పై ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సును ఈ ఏడాది డిసెంబరు ఒకటోతేదీ నుండి 12వతేదీ వరకూ ప్రతి రోజు మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహిస్తామన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్‌లో తయారీ రంగంలో సేవా సంస్థలు ముఖ్యంగా ఎంఎస్‌ఎంఇలను స్థాపించడానికి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. బ్యాంకింగ్ రంగంలో ఎంఎస్‌ఎంఇ విభాగానికి చెందిన నిపుణులు, చార్టర్ అకౌంటెంట్లు, ప్రాక్టీస్ చేస్తున్న లీగల్ ఇంప్లిమెంటర్లు, మార్కెటింగ్ నిపుణులు, ప్రభుత్వ అధికారులు తమ జీవిత అనుభవాలను ట్రైనీలతో పంచుకోవడంతో పాటు సలహాలు, సూచనలు ఇస్తారన్నారు. శిక్షణ పూర్తయిన తర్వాత ఎఫ్‌ఎపిసిసిఐ సర్టిఫికెట్ అందిస్తామని తెలిపారు. అదనపు సమాచారం కోసం ఎస్.జీవన్ 9182927627, కె.శ్రీకాంత్ 9391422821 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

192 మంది తహసీల్దార్ల నివేదిక పంపండి

జెసిలకు సిసిఎల్‌ఎ ఆదేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో డిప్యూటీ కలెక్టర్ల అడహాక్ ప్యానెల్‌లో పేర్కొన్న 192 మంది తహసీల్దార్లపై ఏవైనా శాఖాపరమైన క్రమశిక్షణా కేసులు పెండింగ్‌లో ఉంటే వాటి వివరాలు అత్యవసరంగా డిపిసి (డిపార్టుమెంటల్ ప్రమోషన్ కమిటీ) దృష్టికి తీసుకురావాలని సిసిఎల్‌ఎ జి.సాయిప్రసాద్ పేర్కొన్నారు. ఆయా జిల్లాల జాయింట్ కలెక్టర్లు వెంటనే సమాచారాన్ని పంపాలని ఉత్తర్వుల్లో కోరారు.

లౌకిక రాజ్యాంగ పరిరక్షణ కోసం విస్తృత ప్రచారం

డిసెంబరు 6 సదస్సు జయప్రదంపై వేదిక కార్యాచరణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కుతూ దేశాన్ని కాషాయీకరణ వైపు పయనింపజేస్తున్న బిజెపి చర్యలను ఎండగడుతూ లౌకిక రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన కర్తవ్యం ప్రజలముందున్నదని, ప్రజాచైతన్యం కోసం విస్తృతంగా ప్రచారం చేయాల్సిన అవసరముందని లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక పిలుపునిచ్చింది. కేంద్రంలో మోడీ ప్రభుత్వ మతోన్మాద పోకడలను, కులోన్మాదం వంటి అంశాలను వ్యతిరేకిస్తూ బాబ్రీ మసీదు కూల్చివేత దుర్దినం సందర్భంగా డిసెంబరు 6వ తేదీన లౌకిక రాజ్యాంగ పరిరక్షణ దినంగా నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో దాసరి భవన్లో బుధవారం జరిగిన ప్రజా సంఘాల సమావేశానికి మాజీ ఎమ్మెల్సీ, లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక చైర్మన్ జల్లి విల్సన్ అధ్యక్షత వహించారు. డిసెంబరు 6వ తేదీని బ్లాక్‌డేగా ప్రజాస్వామ్య శక్తులు అభివర్ణించారని సమావేశం గుర్తుచేసింది. మాజీ ఎమ్మెల్సీ విల్సన్, మాజీ ఎమ్మెల్యే ఎంఎ గఫూర్‌తోపాటు లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక కన్వీనర్ మౌలానా ముస్తాక్ అహ్మద్, లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక ప్రతినిధులు మాట్లాడుతూ పౌరుల్లో అభద్రతా భావాన్ని కలిగించేందుకు కేంద్ర పాలకులు కుట్రలకు పాల్పడుతున్నారని తెలిపారు. సిఎఎ, ఎన్‌పిఆర్‌లను మళ్లీ తెరపైకి తెచ్చి ఎన్నికల్లో లబ్ధిపొందడానికి, రిజర్వేషన్లు, దళిత సమస్యలు వివాదం చేసి రాజ్యాంగ స్ఫూర్తిని కాలరాయడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య, లౌకికశక్తులు ఈ ప్రమాదాన్ని ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. నవంబరు 26 తేదీన భారత రాజ్యాంగ దినోత్సవాన్ని లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యాన నిర్వహించాలని సమావేశం నిర్ణయించింది. ఈ సమావేశానికి హైకోర్టు ప్రముఖ న్యాయవాది మతిన్, మైనార్టీ ఉద్యమనేత ఎస్కే షఫీ, అవాజ్ రాష్ట్ర నాయకులు ఎస్‌కె చిస్తి, కెవిపిఎస్ నాయకులు శ్రీనివాస్, సిఐటియు రాష్ట్ర నాయకులు ముజఫర్ అహ్మద్ పాల్గొన్నారు.



లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక సమావేశంలో పాల్గొన్న జల్లి విల్సన్, ఎంఎ గఫూర్

ఎస్‌సి గురుకుల విద్యార్థులకు ముఖ హాజరు

మంత్రి మేరుగ నాగార్జున ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సాంఘిక సంక్షేమ గురుకులాల్లో విద్యార్థులకూ ముఖహాజరు విధానాన్ని ప్రవేశపెట్టాలని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగ నాగార్జున ఆ శాఖ అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం సిబ్బందికి అమలు చేస్తున్న ఈ విధానాన్ని విద్యార్థులకూ అమలు చేయాలని చెప్పారు. ఎస్‌సి సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలపై బుధవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. గురుకులాల్లోకి అడుగుపెట్టిన తర్వాత విద్యార్థులు బయటకు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎస్‌సి హాస్టళ్లలో అక్రమంగా ఉంటున్న వారిని బయటకు పంపించే విషయంలో కఠినంగా వ్యవహరించాలని సూచించారు. బయట వ్యక్తులు హాస్టళ్లలో ఉండటం వల్ల విద్యార్థులూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి గుర్తింపుకార్డులు ఇవ్వాలని, వాచ్‌మెన్లను నియమించాలని ఆదేశించారు. గేట్లు, ప్రహరీగోడలను బాగుచేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు.

కౌలు రైతు చట్ట సవరణకు ఉద్యమం

- భూయజమాని సంతకం నిబంధన తొలగించండి
- సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాధాకృష్ణ, హరిబాబు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో 2019లో వచ్చిన కౌలు రైతు చట్టాన్ని సవరించాలని, చట్టంలో కీలకంగా ఉన్న 'భూ యజమాని సంతకం' అనే నిబంధన మార్చాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.రాధాకృష్ణ, మాగంటి హరిబాబు డిమాండ్ చేశారు. నవంబర్ 21, 22 తేదీల్లో పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో జరిగిన రాష్ట్ర మహాసభలో తీసుకున్న కర్తవ్యాలను గుంటూరులో బుధవారం విలేకరుల సమావేశంలో వారు వివరించారు. గతంలో భూ యజమానితో సంబంధం లేకుండా గ్రామ సభల ద్వారా కౌలు రైతులను గుర్తించే వారని తెలిపారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత భూ యజమానితో ఒప్పందం చేసుకోవాలని నిబంధన పెట్టడంతో 90 శాతం మంది కౌలు రైతులకు గుర్తింపు కార్డులు రావడంలేదని తెలిపారు. దీనివల్ల పంట రుణాలకు, పంట నమోదుకు, ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా వంటి ప్రభుత్వ పథకాలకు దూరమవుతున్నారని, చివరకు పంటను కూడా అమ్ముకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో చట్టంలో మార్పు కోసం పోరాటం ఉధృతం చేయాలని కోరారు. గుర్తింపు కార్డులు ఉన్న వారికి పంట రుణాల మంజూరులో బ్యాంకులు అనేక నిబంధనలు విధిస్తున్నాయని, దీనిపై కూడా ఆందోళనకు పూనుకోవాలని మహాసభలో నిర్ణయించినట్లు వెల్లడించారు. టిడిపి ప్రభుత్వంలో చాలామంది కౌలు రైతులకు రుణమాఫీ కాలేదని, గత మూడేళ్లుగా వ్యవసాయంలో నష్టాలు రావడంతో రుణాలు చెల్లించలేకపోయారన్నారు. దీంతో కౌలు రైతులు జెఎల్‌జి, రైతు మిత్ర గ్రూపులకు బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. రైతులకు సకాలంలో రుణాలు అందక ప్రయివేటు వడ్డీ వ్యాపారులపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారని, రుణ భారం పెరిగి అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అనేక జిల్లాల్లో కల్తీ విత్తనాలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, వీటిపై విచారించి వెంటనే నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేరళ తరహాలో రుణ విమోచన కమిషన్ ఏర్పాటు చేసి రైతులు, కౌలు రైతులు ఆత్మహత్యలకు పాల్పడకుండా నివారించాలని కోరారు. కేరళలో క్వింటాలు వరికి రూ.2860 ధర లభిస్తోందని, రాష్ట్రంలో కూడా పండించిన పంటలకు సరైన మద్దతు నిర్ణయించి కొనుగోలు చేయాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆర్‌బికెల ద్వారా ధాన్యం కొనుగోలు చేయాలని, పండిన ప్రతి గింజను ప్రభుత్వం కొనాలని, 26 క్వింటాలు అనే పరిమితి తీసివేయాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులందరికీ రైతు భరోసా అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగించాలని, దీనికి వెంటనే భూసేకరణ పూర్తి చేయాలని కోరారు. పంటల బీమా పరిహారం రైతులందరికీ అందేలా బీమా నిబంధనలు మార్చాలని కోరారు. రాబోయే కాలంలో కౌలు రైతుల సమస్యలపై కౌలు రైతులను కూడగట్టి మిలిటెంట్ ఉద్యమాలు చేయాలని మహాసభ నిర్ణయించినట్లు తెలిపారు. కౌలు రైతు సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి బైరగాని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వాసిరెడ్డి నరసమ్మ కన్నుమూత

సిపిఎం సంతాపం - నేడు అంత్యక్రియలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

వామపక్ష శ్రేయోభిలాషి, సీనియర్ జర్నలిస్టు వాసిరెడ్డి సత్యనారాయణ సతీమణి వాసిరెడ్డి వెంకట నరసమ్మ (84) కన్నుమూశారు. అనారోగ్యంతో గత కొద్దిరోజులుగా ఓ ప్రైవేటు ఆసపత్రిలో ఆమె చికిత్స పొందుతున్న ఆమె బుధవారం మధ్యాహ్నం తుదిశ్వాస విడిచారు. వాసిరెడ్డి సత్యనారాయణ 2013 మార్చి 22న కన్నుమూశారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. వామపక్ష సభలు, సమావేశాలు, మహిళా సదస్సులకు నరసమ్మ హాజరయ్యేవారు. నరసమ్మ బాపట్ల జిల్లా (పాత గుంటూరు జిల్లా) రేపల్లె సమీపంలోని చింతమోటు గ్రామంలో జన్మించారు. పాఠశాల విద్యను కృష్ణా జిల్లా పెదపులిపర్రు, చల్లపల్లిలో పూర్తిచేశారు. మచిలీపట్నంలో ఇంటర్, డిగ్రీ, ఆంధ్రా విశ్వవిద్యాలయంలో పోస్టు గ్రాడ్యుయేషన్ చేశారు. ఆకుకూరు ప్రభుత్వ కళాశాలలో బోటనీ లెక్చరర్‌గా పనిచేశారు. ఆ తర్వాత విజయవాడలోని ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సివిఆర్ ప్రభుత్వ కళాశాలలో సీనియర్ లెక్చరర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. ఏటా ప్రజాశక్తికి కొంత మొత్తాన్ని విరాళం ఇచ్చేవారు. కృష్ణలంక స్వర్గపురిలో గురువారం ఉదయం పది గంటలకు అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వాసిరెడ్డి వెంకట నరసమ్మ మృతి పట్ల సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సిపిఎం పూర్వ కార్యదర్శి పి.మధు, ప్రజాశక్తి సంపాదకులు బి. తులసీదాస్, చీఫ్ జనరల్ మేనేజరు వై. అచ్యుత్‌రావు తదితరులు సంతాపం ప్రకటించారు. వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలియజేశారు. ఆమె భౌతికకాయాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ సందర్శించి, నివాళులర్పించారు.


నరసమ్మ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పిస్తున్న బాబూరావు


ప్రెస్ అకాడమీ ఛైర్మన్ కొమ్మినేనిని సన్మానిస్తున్న ప్రభుత్వ సలహాదారులు జివిడి కృష్ణమోహన్

కొమ్మినేనికి సన్మానం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రెస్ అకాడమీ నూతన ఛైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావును ప్రభుత్వ సలహాదారులు జివిడి కృష్ణమోహన్ ఘనంగా సన్మానించారు. బుధవారం తాడేపల్లిలోని జరిగిన ఈ కార్యక్రమంలో ప్లానింగ్ బోర్డు ఛైర్మన్ మల్లాది విష్ణువర్ధన్, మాజీ మంత్రులు వెల్లంపల్లి, పేర్ని, లిడ్‌క్యాప్ ఛైర్మన్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొమ్మినేని రచించిన పుస్తకాలను జివిడికి అందజేశారు.

వ్యవసాయ సలహాదారుగా తిరుపాల్‌రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వ్యవసాయశాఖ సలహాదారుగా వైఎస్‌ఆర్ కడప జిల్లాకు చెందిన ఐ.తిరుపాల్‌రెడ్డిని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పూనం మాలకొండయ్య ఉత్తర్వులు విడుదల చేశారు. రెండేళ్లపాటు ఆయన ఈ పదవిలో ఉండనున్నారు.

ఎపిలో ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతిపక్ష పార్టీల ఐక్యత అవసరం

సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వాల అప్రజాస్వామిక విధానాలను, అరాచకాలను అరికట్టేందుకు టిడిపి, జనసేన, సిపిఐ, సిపిఎం కాంగ్రెస్ పార్టీల ఐక్యత ఆవసరమని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ అన్నారు. ప్రజాస్వామ్య రక్షణ కోసం ఇష్టమున్నా, లేకున్నా కలిసికట్టుగా బిజెపి, వైసిపిని గద్దె దించితేనే ప్రజాస్వామ్యానికి మనుగడ ఉంటుందన్నారు. విజయవాడ దాసరిభవన్‌లో బుధవారం మాజీ ఎమ్మెల్సీ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు జల్లి విల్సన్‌తో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇతర పార్టీ నేతలపై ఒత్తిడి తెచ్చేలా సిబిఐ, ఇడిని కేంద్ర ప్రభుత్వం వినియోగిస్తోందనీ, ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడానికి డబ్బు, పదవులను ఎరగా చూపుతున్నారనీ మండిపడ్డారు. గవర్నర్ల వ్యవస్థనూ స్వార్థం కోసం వాడుతున్నారని, ఈ వ్యవస్థను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులోనూ భిన్నమైన తీర్పులు రావడం వింతగా ఉందనీ, దీనిపై పూర్తి ధర్మాసనం ఒక స్పష్టమైన తీర్పు ఇవ్వాలన్నారు. ఎపిలో బిజెపి, వైసిపి కలిసి పనిచేస్తున్నాయని అన్నారు. వైసిపి ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలనివ్వబోమని పవన్ కల్యాణ్ గతంలో చెప్పి తీరా మోడీతో కలిశాక మౌనం దాల్చారని తెలిపారు. రాష్ట్రంలో టిడిపిని బలహీనపరిస్తే బిజెపి బలం పెరుగుతుందని కేంద్రం భావిస్తోందని మండిపడ్డారు. రిషికొండ ప్రైవేటు ప్రాపర్టీ కాదనీ, అది ప్రభుత్వ ప్రాపర్టీ అని స్పష్టంచేశారు. రిషికొండను చూడకూడదంటూ ఎలా ఆంక్షలు విధిస్తారంటూ ప్రశ్నించారు. జి20 దేశాల సమావేశానికి కమలం గుర్తు తరహాలో లోగో పెట్టడం సరికాదనీ అన్నారు.

ఎఫ్‌ఆర్‌ఒ శ్రీనివాసరావుకు కన్నీటి వీడ్కోలు

- ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రగొండ మండలం బెండలపాడు గ్రామం ఎర్రబోడు ప్రాంతంలోని వలస ఆదివాసీల దాడిలో మృతి చెందిన ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ చలమల శ్రీనివాసరావుకు బుధవారం కడసారి వీడ్కోలు పలికారు. ఆయన స్వగ్రామం ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం ఈర్లపూడిలోని శ్రీనివాసరావు వ్యవసాయ క్షేత్రంలో ప్రభుత్వ లాంఛనాల నడుమ కుటుంబ సభ్యులు దహనసంస్కారాలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున అటవీశాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర అంత్యక్రియల్లో పాల్గొని పాడె మోశారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. అంత్యక్రియలకు ముందు మంత్రులు పువ్వాడ అజయ్, ఇంద్రకరణ్ రెడ్డి, ఎంపి వద్దిరాజు రవిచంద్ర మాట్లాడారు. శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు ప్రభుత్వం తరపున రూ.50 లక్షలు పరిహారం, శ్రీనివాసరావు రిటైర్మెంట్ వయస్సు వరకు యథాతథంగా నెలవారీ వేతనం. ఆయన భార్యకు ప్రభుత్వ ఉద్యోగం, 500 గజాల ఇంటి స్థలం ఇవ్వనున్నట్లు తెలిపారు. తక్షణ సాయంగా రూ.రెండు లక్షల నదుగను అందజేశారు. హత్య చేసిన ఎవరినీ వదిలిపెట్టబోమని చెప్పారు. ప్రభుత్వం ఈ ఘటనను చాలా సీరియస్‌గా తీసుకుందన్నారు. పోడు నరికినట్టు అటవీ అధికారులనూ నరుకుతామంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. తమ ప్రాణాలకు రక్షణ కల్పించాలంటూ ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు వరంగల్, నల్లగొండ జిల్లాల నుంచి పలువురు అటవీశాఖ అధికారులు, సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి అంత్యక్రియలకు హాజరయ్యారు. మంత్రులకు తమ సమస్యలు చెప్పుకున్నారు. ఆయుధాలు లేకుండా అడవుల్లో తిరగడం వల్ల తమ ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. ఆయుధాలు ఇవ్వకపోతే విధులను బహిష్కరిస్తామంటూ హెచ్చరించారు. వీటిని సిఎం కెసిఆర్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషిచేస్తామని మంత్రులు హామీనిచ్చారు.

హత్యకు సిపిఎం ఖండన

రేంజర్ శ్రీనివాసరావు హత్యను సిపిఎం ఖమ్మం జిల్లా కమిటీ ఖండించింది. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, జిల్లా నాయకులు తదితరులు అంత్యక్రియలకు హాజరయ్యారు. శ్రీనివాసరావుకు నివాళి అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ఓ ప్రకటనలో సంతాపం వెలిబుచ్చారు.

వ్యవసాయ కార్మిక సంఘం 29వ మహాసభల వాల్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

'కూలి పెంచాలి- భూమి పంచాలి' అనే నినాదంతో జంగారెడ్డిగూడెంలో డిసెంబరు 8,9,10 తేదీలో జరుగనున్న ఎపి వ్యవసాయ కార్మికసంఘం 29వ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ రూపొందించిన వాల్‌పోస్టర్‌ను సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ బుధవారం ఆవిష్కరించారు. విజయవాడ బందరు రోడ్డులో బాలోత్సవ్‌భవన్‌లో బుధవారం జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో వెంకట్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. డిసెంబరు 8న జంగారెడ్డి గూడెంలో భారీ బహిరంగసభ, ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. బహిరంగ సభకు ముఖ్య వక్తలుగా మాజీ ఎంపి బృందాకరత్, అఖిల భారత అధ్యక్ష కార్యదర్శులు వి.విజయన్, రైతు సంఘం నాయకులు వి.శ్రీనివాసరావు పాల్గొంటారని తెలిపారు. బహిరంగ సభకు వేలాదిగా వ్యవసాయ కూలీలు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దడాల సుబ్బారావు, వి.వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు వి.శివనాగరాణి, ఎ.రవి, నారాయణ, వి.నాగరాజు, సహాయకార్యదర్శులు కె.ఆంజనేయులు, వెంకమరాజు పాల్గొన్నారు.

నా సెల్ ఫోన్ పోయింది

తాడేపల్లి పోలీస్ స్టేషన్లో ఎంపి విజయసాయిరెడ్డి పిఎ ఫిర్యాదు

ప్రజాశక్తి- తాడేపల్లి (గుంటూరు జిల్లా)

నా సెల్ ఫోన్ పోయిందంటూ గుంటూరు జిల్లా తాడేపల్లి పట్టణ పోలీస్ స్టేషన్లో రాజ్యసభ ఎంపి, వైసిపి రాష్ట్ర నాయకులు కె.విజయసాయిరెడ్డి వ్యక్తిగత సహాయకుడు (పిఎ) లోకేశ్ బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పట్టణ సిఐ శేషగిరిరావు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. సెల్‌ఫోన్ ఎక్కడ పోయింది? ఎలా పోయింది? అనే వివరాలను పిఎ తన ఫిర్యాదులో పొందుపర్చనట్లు సమాచారం.

మత్స్యకార నిర్వాసితుల సమస్యలు పట్టవా?

- జెట్టీ నిర్మించే వరకు వేటకు అనుమతించాలి
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హామీలను అమలు చేయాలి
- ఎన్ఎఎబి నిర్వాసితుల దీక్షల్లో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



నిర్వాసితులనుద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి, రాంబిల్లి విలేకరి

నేవల్ ఆల్టర్నేటివ్ ఆపరేషన్స్ బేస్ (ఎన్ఎఎబి) నిర్వాసితుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్వాసితులు, ప్రభావిత ప్రజలను జెట్టీ నిర్మించే వరకు శారద, వరహా నదుల్లో చేపల వేటకు ఎన్ఎఎబి గేటు లోపలకు అనుమతించాలని, నిర్వాసితులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం వాడ నర్సాపురం గ్రామం వద్ద నిర్వాసితులు చేస్తోన్న దీక్షా శిబిరాన్ని వి.శ్రీనివాసరావు సందర్శించి వారి పోరాటానికి మద్దతు తెలిపారు. నేవల్ బేస్ మెయిన్ గేటు వద్ద ఎన్ఎఎబి నిర్వాసితుల జెఎసి ఆధ్వర్యాన ఎన్ఎఎబి నిర్వాసితులు, ప్రభావిత గ్రామ ప్రజలు చేస్తోన్న దీక్షలు 24 రోజులకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. 2013 భూసేకరణ చట్టం ప్రకారం 18 ఏళ్లు నిండిన వారందరికీ పూర్తిస్థాయిలో ప్యాకేజీ ఇవ్వాలని, యువతకు శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. జెట్టీ నిర్మించే వరకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపిస్తామని చెప్పి, ఇప్పుడు నదుల్లో వేటకు వెళ్లడానికి అనుమతించకపోవడం అన్యాయమన్నారు. దేశ రక్షణ కోసం ఎన్ఎఎబికి భూములిచ్చిన మత్స్యకారులు, ఇతర వృత్తిదారులను రోడ్డున పడేస్తే వారెలా బతుకుతారని ప్రశ్నించారు. నిర్వాసితుల జీవితాలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆటలాడుతున్నాయని విమర్శించారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం, రక్షణశాఖ.. నిర్వాసితులకు ఇచ్చిన హామీలు, చర్చల సందర్భంగా ప్రభుత్వ యంత్రాంగంతో చేసిన ఒప్పందాలు అమలుచేయాలని, యువతకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం ఉద్యోగాలివ్వాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం పట్టుదలతో నిర్వాసితులు సాగించే పోరాటానికి సిపిఎం సంపూర్ణంగా సహకరిస్తుందని తెలిపారు. సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం మాట్లాడుతూ.. పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. దీక్షల్లో సిపిఎం రాంబిల్లి మండల కార్యదర్శి దేముడునాయుడు, జెఎసి, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నేడు 'ఆక్వా రైతాంగానికి ఇదేం కర్మ' సదస్సు

- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సంక్షోభంలో ఉన్న ఆక్వా రైతులకు అండగా నిలబడేందుకు 'ఇదేం కర్మ ఆక్వా రైతాంగానికి' అనే పేరుతో బుధవారం టిడిపి జాతీయ కార్యాలయంలో రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్లు టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు వెల్లడించారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. ఈ సదస్సుకు పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడుతో పాటు ముఖ్య నాయకులు హాజరై ఆక్వా రైతులకు జరుగుతున్న అన్యాయాన్ని చర్చించి ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తారని వివరించారు. ఆక్వా రైతులకు యూనిట్ విద్యుత్ ధర రూ.1.50కే సరఫరా చేస్తానని జగన్ హామీ ఇచ్చి రైతులను వంచించారని విమర్శించారు.

26 నుంచి సిబిఒఎ 19వ త్రై వార్షిక జాతీయ స్థాయి మహాసభ

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ, విశాఖ

కెనరా బ్యాంకు ఆఫీసర్స్ అసోసియేషన్ (సిబిఒఎ) 19వ త్రై వార్షిక జాతీయ స్థాయి మహాసభను ఈ నెల 26, 27, 28 తేదీల్లో విజయవాడ-మంగళగిరి సమీపంలోని సికె కన్వెన్షన్ హాల్లో నిర్వహించనున్నట్లు కెనరా బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ రవికుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సభలో పాల్గొనేందుకు దేశ నలుమూలల నుంచి ఎలక్టెడ్ డెలిగేట్స్ హాజరు కానున్నారని పేర్కొన్నారు.

ఈ మహాసభకు కెనరా బ్యాంక్ ఎండి అండ్ సిఇఒ ఎల్వి ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని తెలిపారు. కెనరా బ్యాంక్ ఆఫీసర్స్ ఐక్యతకు చిహ్నంగా, పారదర్శకతకు ప్రతి రూపంగా, ఈ మహా సభ నిర్వహిస్తున్నామని వివరించారు. ఆఫీసర్స్ జీవన శైలికి అనువుగా, మేనేజ్మెంట్ లక్ష్యాలు చేరుకునేలా పలు తీర్మానాలు చేయనున్నామని పేర్కొన్నారు. కెనరా బ్యాంక్ ఆఫీసర్స్ చేసే నృత్య ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయని పేర్కొన్నారు.

సిఎం బందోబస్తు విధుల్లో కానిస్టేబుల్ మృతి

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి పర్యటనకు బందోబస్తుగా వచ్చిన అనకాపల్లికి చెందిన ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ వై.అప్పారావు (55) గుండెపోటుతో మృతి చెందారు. బందోబస్తు విధులకు వచ్చిన పోలీసులకు నరసన్నపేట సమీపంలోని కేటాయించిన ఫంక్షన్ హాల్లో మంగళవారం ఆయన విశ్రాంతి తీసుకున్నారు. బుధవారం అస్వస్థతగా ఉండడంతో ఆయనను విధులకు కేటాయించలేదు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఛాతి నొప్పి రావడంతో పోలీసులు ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతదేహాన్ని అంబులెన్స్లో అనకాపల్లిలోని ఆయన స్వగ్రామానికి తరలించారు.

రెండు ఎల్ఐసి పాలసీల నిలిపివేత

న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద బీమా కంపెనీ ఎల్ఐసి తన రెండు పాలసీలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ఎల్ఐసి జీవన్ అమర్, టెక్ టర్మ్ పాలసీలను విరమించుకుంటున్నట్లు బుధవారం వెల్లడించింది. నవంబర్ 23 నుంచి ఆ రెండు పాలసీలు వినియోగంలో ఉండవని స్పష్టం చేసింది. 2019 ఆగస్ట్లో జీవన్ అమర్ ప్లాన్, ఆ ఏడాది సెప్టెంబర్లో ఎల్ఐసి టెక్ టర్మ్ ప్లాన్లను ఆవిష్కరించింది. రీ ఇన్స్యూరెన్స్ ప్రీమియం ధరలు పెరగడం వల్లనే తొలగిస్తున్నట్లు పేర్కొంది. భవిష్యత్తులో ఈ రెండు పాలసీల్లో పలు మార్పులను చేసి మళ్లీ అందుబాటులోకి తేనున్నట్లు వెల్లడించింది. కాగా.. ఇప్పటికే ఈ రెండు పాలసీలను కొనుగోలు చేసిన వారికి సేవలు కొనసాగుతాయని తెలిపింది. అయితే.. కొత్త పాలసీల జారీ ఉండదని స్పష్టం చేసింది.



2కె రన్లో పాల్గొన్న యువకులు, కెవిపిఎస్ నాయకులు

అంటరానితనంపై పోరాటం

- కెవిపిఎస్ రాష్ట్ర మహాసభ జయప్రదానికి 2కె రన్

ప్రజాశక్తి -కర్నూలు కార్పొరేషన్

కెవిపిఎస్ నాల్గవ రాష్ట్ర మహాసభ జయప్రదం చేయాలని కోరుతూ ఆ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కర్నూలులో 2కె రన్ నిర్వహించారు. ఆర్ఎస్ రోడ్డు కూడలి నుంచి ఎస్టిబిసి కళాశాల, ఎన్టిఆర్ సర్కిల్, జైన్ స్తూపం, కోట్ల విజయభాస్కర్ రెడ్డి సర్కిల్ మీదుగా పాత బస్టాండ్లోని అంబేద్కర్ సర్కిల్ వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో యువకులు భారీ ఎత్తున పాల్గొన్నారు. అంటరానితనానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంతకు ముందు ఆర్ఎస్ రోడ్డు (బుధ రోడ్డు) కూడలి వద్ద బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పి.ఎస్.రాధాకృష్ణ, దళిత గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు ఈశ్వరయ్య పూలమాలవేసి నివాళులర్పించారు. రెండవ పట్టణ సిఐ వి.శ్రీనివాసులు జెండాను ఊపి 2కె రన్ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంటి. ఆనందబాబు మాట్లాడుతూ.. ఈ నెల 28, 29న కర్నూలులో కెవిపిఎస్ నాల్గవ రాష్ట్ర మహాసభ జరగనున్నట్లు తెలిపారు. తొలిరోజు కిసాన్ ఘాట్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రదర్శనను జయప్రదం చేయాలని కోరారు. ఈ మహాసభల్లో అంటరానితనం అసమానతలకు వ్యతిరేకంగా పలు తీర్మానాలు చేయనున్నట్లు తెలిపారు. అంటరానితనంపై కెవిపిఎస్ కార్యకర్తలు పోరాడాలని కోరారు. కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు రాధాకృష్ణ అధ్యక్షతన వహించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గౌస్ దేశాయ్, నగర నాయకులు రాముడు, కెవిపిఎస్ మాజీ జిల్లా అధ్యక్షులు ఎం.రాజశేఖర్, ఐలు రాష్ట్ర నాయకులు వెంకటస్వామి, ఆర్ విఎస్, జిఎంపిఎస్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శులు గురు శేఖర్, గోయిందు, నగేష్, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు బి.కరుణాకర్, డి విజయమ్మ పాల్గొన్నారు.

రేషన్ పరేషాన్

- కడప, తిరుపతి జిల్లాలకు చేరని ఉచిత బియ్యం
- నేటికీ 50 శాతం కూడా పంపిణీకి నోచని వైనం
- నెలాఖరు వరకూ పొడిగిస్తామన్న కమిషనర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ యోజన పథకం (పిఎంజికెఎవై) లో భాగంగా జాతీయ ఆహార భద్రతా చట్టం (ఎన్ఎఫ్ఎస్ఎ) కింద పేదలకు ఉచితంగా ఇచ్చే బియ్యం పంపిణీ రాష్ట్ర వ్యాప్తంగా 50 శాతం కూడా దాటలేదు. దీంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 90 లక్షల మంది ఎన్ఎఫ్ఎస్ఎ కార్డుదారులు ఉండగా వీరందరికీ 19వ తేదీ నుండి 27వ తేదీ వరకూ బియ్యాన్ని ఇస్తారు. అయితే బుధవారం నాటికి 43.77 లక్షల మందికి పంపిణీ చేశారు. ముఖ్యంగా కడప, తిరుపతి జిల్లాలకు బియ్యం సరఫరా జరగలేదు. ఎఫ్సిఐ నుంచి బియ్యం సరఫరాలో ఆలస్యం కావడం, పౌరసరఫరాలసంస్థ వద్ద సరిపడినన్ని నిల్వలు లేకపోవడం వల్లే సరఫరా చేయలేకపోయామని అధికారులు తెలిపారు. కొన్ని జిల్లాల్లో సరఫరా కాకపోవడానికి కార్డుదారులకు అవగాహన లేకపోవడమేనని చెబుతున్నారు. రేషన్కార్డులు ఏ పథకం కింద ఉన్నాయో తెలియకపోవడం కూడా బియ్యాన్ని తీసుకోకపోవడానికి ఒక కారణంగా ఉందని అధికారులు వివరిస్తున్నారు. ప్రతి చిన్న విషయానికి వాట్సప్ మెసేజ్లు పెట్టే గ్రామ వాలంటీర్లు ఉచిత బియ్యం తీసుకునేందుకు అర్హత ఉన్న లబ్ధిదారులకు బియ్యం ఫలానా తేదీ నుంచి ఇస్తారనే సమాచారాన్ని తెలియజేయకపోవడమూ మరొక కారణమని చెబుతున్నారు. కేంద్ర ప్రభుత్వం పిఎంజికెఎవై కింద రాష్ట్రానికి 3.24 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని కేటాయించింది. అక్టోబరు నుంచి పంపిణీ చేయాల్సిన బియ్యం నిల్వలు లేకపోవడంతో, బియ్యం కోటాను కేంద్ర ప్రభుత్వ అనుమతితో నవంబరు, డిసెంబరు, జనవరి నెలలకు రాష్ట్ర ప్రభుత్వం మార్చింది. ఏది ఏమైనా ఉచిత బియ్యం పంపిణీకి సంబంధించిన ప్రచారం గ్రామస్థాయిలో అనుకున్నంత లేకపోవడంతో పంపిణీ గురించి లబ్ధిదారులకు తెలియక కార్డుదారులు ఇబ్బందులకు గురవుతున్నారు.

వైసిపి అనుబంధ సంఘాల కో ఆర్డినేటర్గా చెవిరెడ్డి భాస్కర్రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైసిపి అనుబంధ సంఘాల కో ఆర్డినేటర్గా చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్రెడ్డిని నియమించారు. సిఎం ఆదేశాల మేరకు భాస్కర్రెడ్డిని అనుబంధ సంఘాల కో ఆర్డినేటర్గా నియమించినట్లు బుదవారం వైసిపి కేంద్రకార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. చెవిరెడ్డి భాస్కర్రెడ్డి పార్టీ రాష్ట్ర కో ఆర్డినేటర్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి విజయసాయిరెడ్డికి సహాయకారిగా వ్యవహరిస్తారని పేర్కొంది.

పిసిసి అధ్యక్షుడిగా రుద్రరాజు

- వర్కింగ్ ప్రెసిడెంట్లుగా నలుగురు నియామకం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా గిడుగు రుద్రరాజు, కార్యనిర్వాహక అధ్యక్షులుగా మస్తాన్ వలీ, జంగా గౌతమ్, సుంకర పద్మశ్రీ, రాకేష్ రెడ్డిని కాంగ్రెస్ అధిష్టానం నియమించింది. ఈ మేరకు ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ బుధవారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. పొలిటికల్ అఫైర్స్ కమిటీలో ఉమెన్ చాందీ, సిడి మొయిప్పన్, క్రిష్టోఫర్ తిలక్, గిడుగు రుద్రరాజు, కెవిపి రామచంద్రరావు, రఘువీరారెడ్డి, సాకే శైలజానాథ్, ఎం.ఎం పల్లంరాజు, చింతా మోహన్, టి సుబ్బరామిరెడ్డి, జెడి శీలం, జివి హరిష్ కుమార్, కె బాపిరాజు, ఎన్ తులసీరెడ్డి, కె రాజు, మస్తాన్ వలీ, సిరివెల్ల ప్రసాద్, ఉషా నాయుడు సభ్యులుగా ఉన్నారు. ఎఐసిసి ప్రోగ్రాం అమలు కమిటీ చైర్మన్గా ఎంఎం పల్లం రాజును, ప్రచార కమిటీ చైర్మన్గా జివి హర్షకుమార్, మీడియా, సోషల్ మీడియా కమిటీ చైర్మన్గా తులసీరెడ్డిని నియమించారు. 34 మందితో కోఆర్డినేషన్ కమిటీని ఏర్పాటు చేశారు.

'అనంత'లో మరో 'విద్యుత్తు' ప్రమాదం

- మహిళా రైతు మృతి

ప్రజాశక్తి - బొమ్మనహాల్

అనంతపురం జిల్లాలో మరో విద్యుత్తు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ నెల 2న ట్రాక్టర్పై విద్యుత్ తీగ తెగి పడి నలుగురు కూలీలు మృతి చెందిన బొమ్మనహాల్ మండలం దర్గాహోన్నూర్ గ్రామంలోనే బుధవారం మరో ఘటన చోటు చేసుకుంది. పొలానికి నీళ్లు పెట్టేందుకు స్టార్టర్ను ఆన్చేసే క్రమంలో విద్యుదాఘాతానికి గురై మహిళా రైతు మరణించారు. మృతుని కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. దర్గాహోన్నూర్ గ్రామానికి చెందిన దంపతులు బోయ ఓబులేసు, వాణి(25) రెండు ఎకరాలను కౌలుకు తీసుకుని మొక్కజొన్న పంటను సాగు చేశారు. క్రిమి సంహారక మందు పిచికారీ చేసే నిమిత్తం దంపతులిద్దరూ పొలానికి వెళ్లారు. మందు కలుపుకునేందుకు నీళ్లు లేకపోవడంతో మోటార్ను ఆన్చేసేందుకు వాణి వెళ్లారు. అప్పటికే సర్వీసు వైరు తెగి స్టార్టర్పై పడింది. ఈ విషయాన్ని గమనించని వాణి స్టార్టర్ను ఆన్ చేయగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మరణించారు. బోయవాణికి ఆరు నెలల క్రితమే వివాహమైంది. ఇంతలోనే ఆమె మృతిచెందడంతో భర్త, మృతుని కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. మంగళవారం కూడా ఇదే గ్రామంలో 11 కెవి విద్యుత్తు వైరు తెగి రోడ్డుపై పడింది. గ్రామస్తులు గుర్తించి విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ గ్రామంలో వరుసగా విద్యుత్తు ప్రమాదాలు చోటు చేసుకొంటుండంతో గ్రామస్తులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు.

భూరక్ష కాదు.. భూభక్ష : టిడిపి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ భూములను ఆక్రమించిన జగన్ కన్ను ఇప్పుడు ప్రజల భూములపై పడిందని టిడిపి అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ విమర్శించారు. భూరక్ష పేరుతో భూభక్ష పథకానికి శ్రీకారం చుట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టిడిపి రాష్ట్ర కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

రాష్ట్రవ్యాప్తంగా ఎవరెవరి భూములను ఎలా భక్షించాలన్నదే ఈ పథకం ముఖ్య ఉద్దేశమని విమర్శించారు. ప్రజల భూములు తన భూములుగా ప్రజలకు తెలియచెప్పడానికే భూభక్ష పథకాన్ని ప్రారంభించారని విమర్శించారు. మాజీ సైనికులకు చెందిన భూముల రెవెన్యూ రికార్డులు మార్చేసి కబ్జాచేసిన భూబకాసురుడు మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఎంపిలు విజయసాయిరెడ్డి, ఎంపి ఎంవివి సత్యనారాయణ భూకబ్జాల గురించి జగన్ చెప్పాలని కోరారు. సభలో జగన్కు అటూ ఇటూ కూర్చున్న భూకబ్జాకోరుల సంగతేంటని నిలదీశారు. రాష్ట్రవ్యాప్తంగా మిగిలిన భూములను గుర్తించి వాటిని కబ్జాచేయడం, బ్యాంకుల్లో తనఖాపెట్టడం, అయినకాడికి అప్పులు చేయడానికి జగన్ ఈ పథకాన్ని తీసుకొచ్చారని చెప్పారు. జగన్ కుట్ర, కుతంత్రాలను గమనించి ప్రజలు తమ భూముల వివరాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకోవాలని సూచించారు.

ధాన్యం కొనుగోలు చేయాలని రాస్తారోకో



రహదారిపై ధాన్యం పోసి రాస్తారోకో చేస్తున్న రైతులు

ప్రజాశక్తి - దెందులూరు (ఏలూరు)

కళ్లాల్లోని ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ ఏలూరు జిల్లా దెందులూరు మండలం కొవ్వలిలో పోతునూరు-ఏలూరు రోడ్డుపై కౌలు రైతులు, రైతులు రాస్తారోకో చేశారు. రవాణా, హమాలీల ఏర్పాట్లు ప్రభుత్వమే చూడాలని నినాదాలు చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ధాన్యం సేకరణలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విధానం వల్ల అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతం కాకపోవడంతో కళ్లాల్లోనే ధాన్యం నిల్వలు ఉండిపోతున్నాయన్నారు. ధాన్యాన్ని తూకం వేసిన తర్వాత ఏ మిల్లుకు తీసుకువెళ్లాలి అనే విషయాన్ని ఆలస్యంగా చెబుతుండటంతో లారీలు, ట్రాక్టర్ల యజమానులు ధాన్యం రవాణాకు ముందుకు రావడం లేదని తెలిపారు. ఎకరాకు 34 బస్తాల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేస్తామని ప్రభుత్వం నిబంధనలు విధించడం సరికాదన్నారు. కొనుగోలు పరిమితిని 40 బస్తాలకు పెంచాలని, తేమశాతం నిబంధనలు సడలించి వెంటనే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులను సమీకరించి ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు బగాది చిన్నారావు, గుత్తా శ్రీనివాసరావు, తాండ్ర కాంతారావు, కౌలు రైతులు, రైతులు పాల్గొన్నారు.

అక్రమ రేషన్ పట్టివేత

- ప్రజాసంఘాల రాస్తారోకోతో కదిలిన రెవెన్యూ యంత్రాంగం



పట్టుకొన్న రేషన్ బియ్యాన్ని పరిశీలిస్తున్న రెవిన్యూ అధికారులు

ప్రజాశక్తి-కనిగిరి (ప్రకాశం జిల్లా)

అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న వాహనాన్ని ప్రజాసంఘాలు అడ్డుకున్న ఘటన మంగళవారం అర్ధరాత్రి కనిగిరి పట్టణంలోని సాయిబాబా థియేటర్ సమీపంలో చోటుచేసుకుంది. సాయిబాబా థియేటర్ వద్ద అక్రమంగా 150 బస్తాల రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న ఆల్విన్ వాహనాన్ని డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ప్రజాసంఘాల కార్యకర్తలు అడ్డుకున్నారు. దీంతో వాహన డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. సమాచారాన్ని రెవెన్యూ సిబ్బందికి తెలియజేశారు. బుధవారం ఉదయం పది గంటల వరకూ రెవెన్యూ అధికారులు స్పందించక పోవటంతో సిఐటియు జిల్లా కార్యదర్శి పిసి కేశవరావు ఆధ్వర్యంలో వాహనాన్ని అడ్డుకొన్న ప్రదేశంలోని 15వ నెంబర్ రేషన్ షాపు ఎదుట రాస్తారోకో చేపట్టారు. పోలీసులు వచ్చి.. రాస్తారోకో విరమించాలని కోరగా రెవెన్యూ అధికారులు వచ్చి విచారణ చేపట్టే వరకూ విరమించేది లేదని భీష్మించారు. దీంతో రోడ్డుపై వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. పొదిలి ఎన్ఫోర్స్మెంట్ డిటి ఎస్కె షాబీరా, ఎఫ్సిఐ డిటి షాజహాన్ ఘటన వద్దకు చేరుకొని రేషన్ షాపును తనిఖీ చేశారు. స్టాకులో ఎటువంటి తేడాలు లేవని తేల్చిచెప్పారు. షాపు నుంచి రేషన్ బియ్యాన్ని వాహనంలోకి లోడు చేస్తున్న వీడియో ఫుటేజి తమ వద్ద ఉందని ఆందోళనకారులు విచారణాధికారులకు తెలియజేశారు.

పేదలకు చెందాల్సిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు చేపట్టాలని కోరారు. సతీష్ అనే వ్యక్తి రేషన్ అక్రమ వ్యాపారం చేస్తున్నారని ఆయనతోపాటు రేషన్ దుకాణదారుడిపై కఠినచర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎన్ఫోర్స్మెంట్ డిటి షాబిరా మాట్లాడుతూ ఆల్విన్ వాహనాన్ని పోలీస్ స్టేషన్కు, బియ్యాన్ని ఎఫ్సిఐ గోడౌన్కు తరలిస్తామని, తదుపరి విచారణ చేపట్టి నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామని హామీ ఇచ్చారు.

హెచ్పిలో 6 వేలు, క్రెడిట్ సూసెలో 9 వేలు మంది తొలగింపు!

న్యూయార్క్ : ఆర్థిక మాంద్యం భయంతో ట్విట్టర్, మెటా, అమెజాన్, సిస్కో సహా వివిధ కంపెనీలు అధిక సంఖ్యలో ఉద్యోగులను తొలగిస్తున్నాయి. ఇదే బాటలో తాజాగా హెచ్పి సైతం 6,000 మంది ఉద్యోగులకు ఉద్వాసన పలకడానికి కసరత్తును ప్రారంభించింది. జ్యూరిచ్ కేంద్రంగా పనిచేస్తున్న క్రెడిట్ సూసె 9,000 మంది ఉద్యోగులను తొలగించే పనిలో ఉన్నట్లు తెలిపింది.

ప్రస్తుత త్రైమాసికంలో దాదాపు 2,700కి ఉద్వాసన పలకనున్నట్లు తెలిపింది. 2025 నాటికి మొత్తం ఉద్యోగుల్లో 12 శాతం అంటే 9,000 మందిని ఇంటికి పంపించనున్నట్లు పేర్కొంది. కంపెనీ వెల్త్ మేనేజ్మెంట్ విభాగం పూర్తిగా నష్టాల్లోకి జారుకోవడమే ఇందుకు కారణమని వెల్లడించింది.

2న ఆర్బిఐ వర్కింగ్ గ్రూప్ భేటీ

- గ్యారంటీల పైనే కీలక చర్చ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఆర్థిక రంగానికి సంబంధించి పలు కీలక అంశాలపై రిజర్వ్బ్యాంకు వచ్చే నెల రెండో తేదీన సమావేశాన్ని నిర్వహించనుంది. ఈ భేటీలో రాష్ట్ర ఆర్థిక సంబంధమైన అంశాలపై ప్రధానంగా చర్చించాలని నిర్ణయించింది. ఈ మేరకు అజెండాను రాష్ట్ర ఆర్థికశాఖకు పంపించినట్లు తెలిసింది. ఇందులో ప్రధానంగా రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న గ్యారంటీలపైనే ఎక్కువగా చర్చ జరుగనుంది. ఏయే ప్రభుత్వ రంగ సంస్థలకు ఏయే రకాల గ్యారంటీలు ఇస్తున్నారన్న సమాచారాన్ని ముందుగానే రిజర్వ్బ్యాంకు కోరినట్లు సమాచారం.

ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన గ్యారంటీలపై వివరాలను ఎన్నిసార్లు అడిగినా ఆర్థిక శాఖ స్పందించకపోవడంపై రిజర్వ్బ్యాంకు పదేపదే లేఖలు రాస్తున్న సంగతి తెలిసిందే. నిర్దిష్ట పథకాలకు ఇచ్చే గ్యారంటీలు, ఇతర అవసరాలకు ఇచ్చే గ్యారంటీలు ఉంటాయి. వీటిపై ప్రతి నెలా ఎజి కార్యాలయం, కేంద్రం, ఆర్బిఐలు అడుగున్నాయి. ఈ నేపథ్యంలో గ్యారంటీలపైనే ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన వర్కింగ్ గ్రూప్ రెండో తేదీన భేటీ కానుంది. అలాగే రానున్న కాలంగా గ్యారంటీలకు అన్ని రాష్ట్రాల్లో ఒకే తరహా విధానాన్ని అమలు చేయాలని కేంద్రం భావిస్తున్న నేపథ్యంలో దానిపైనా చర్చ జరగనుంది.

సంపాదకీయం

ఇలాగేనా మహిళా సాధికారత?

మహిళలు, బాలికలపై పెరుగుతున్న హింసను అడ్డుకునేందుకు జాతీయ స్థాయిలో ప్రణాళికలు రూపొందించాలంటూ ప్రపంచ దేశాలకు ఐక్యరాజ్యసమితి (ఐరాస) ఇచ్చిన పిలుపు తక్షణమే కార్యరూపం దాల్చాల్సి ఉంది. మహిళలపై హింస నిర్మూలన దినాన్ని అంతర్జాతీయ స్థాయిలో శుక్రవారం నిర్వహించనున్న నేపథ్యంలో ఐరాస ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ ఈ సూచన చేశారు. మహిళలపై జరుగుతున్న హింస ప్రపంచంలోనే అత్యంత పెద్దఎత్తున సాగుతున్న మానవ హక్కుల ఉల్లంఘనగా ఆయన పేర్కొనడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ప్రతి 11 నిమిషాలకు ఒక మహిళ లేదా బాలిక తన సన్నిహితుల చేతుల్లో హత్యకు గురవుతోందంటూ ఆయన వెల్లడించిన గణాంకాలు దిగ్భ్రాంతిని కలిగిస్తున్నాయి. ఇది, సన్నిహితులు అంటే సమీప కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల చేతుల్లో ప్రాణాలు విడుస్తున్న వారి సంఖ్య మాత్రమే! ఇదికాకుండా, అపరిచితుల చేతుల్లో అర్థాంతరంగా ముగుస్తున్న బతుకుల సంఖ్య వేరే! ఇక రకరకాల రూపాల్లో అత్యాచారాలకు, వేధింపులకు గురై బతుకుపోరును సాగిస్తున్న వారూ ఎందరో ఉన్నారు. ఇవికాక నూతన సాంకేతికత పుణ్యమాని ఆన్‌లైన్ అరాచకత్వమూ పెరిగిపోతోంది. జీవితాల్లోకి చొచ్చుకు వస్తున్న వివిధ సామాజిక మాధ్యమాల్లో లైంగిక దాడులకు, వేధింపులకూ గురవుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. వీరందరి వాస్తవ సంఖ్య వెలుగులోకి వస్తే వేధింపులకు గురికాకుండా ఈ భూమి మీద మిగిలిన వారు ఒక్కరైనా ఉన్నారా అన్న ప్రశ్నతో గుండెలు బద్దలు కావడం ఖాయం.

ఈ హింసాగ్ని జ్వాలల్లో సమిధలుగా మారుతున్న భారతీయ మహిళల సంఖ్యా తక్కువేమీకాదు. కొద్దిరోజుల క్రితం ముక్కలు, ముక్కలుగా మారి మన మధ్య నుండి మాయమైన శ్రద్ధా వాకర్ నుండి నిర్భయలు, దీక్షలు ఎందరో...! మహిళలు, బాలికలుగా పుట్టిన పాపానికి ఎన్నటికీ తరగని క్షోభ వీరిది! దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన నిర్భయ దారుణాన్ని అధికారాన్ని దక్కించుకోవడానికి నిచ్చెనగా వాడుకున్న ప్రస్తుత పాలకులే బిల్కిస్‌బానో కేసులో దోషులను జైలు నుండి విడుదల చేసి రాచమర్యాదలతో ఇంటికి పంపిన తీరును కళ్ళారా చూశాం. ఈ మనువాదుల ఏలుబడిలో బాధిత మహిళల సంఖ్య ఏటికేడు పెరుగుతోంది. హిజాబ్ వేసుకున్నారంటూ బడి పిల్లలను కూడా వెంటాడి వేధిస్తున్న సంఘటనలను చూస్తున్నాం. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో వెల్లడించిన గణాంకాల ప్రకారమే గడిచిన ఆరేళ్లతో పోలిస్తే 2021వ సంవత్సరంలో అత్యధికంగా మహిళలు వేధింపులకు గురయ్యారు. ఈ వేధింపులకు సంబంధించి 2016వ సంవత్సరంలో 3,38,954 కేసులు నమోదు కాగా, 2021వ సంవత్సరంలో డిసెంబర్ 31 నాటికి 4,28, 278 కేసులు నమోదు అయ్యాయి. ఆరేళ్ల క్రితంతో పోలిస్తే ఇది 26.35 శాతం ఎక్కువ! ఘోరం ఏమిటంటే అత్యాచారాల రాజధానిగా మన దేశ కీర్తి అంతర్జాతీయ స్థాయిలో బజారుకెక్కడం! 2020లో 28,153 అత్యాచార కేసులు నమోదుకాగా, 2021లో ఈ సంఖ్య 31,878కి చేరింది. అంతకన్నా సిగ్గుపడాల్సిన విషయం ఏమిటంటే బాధిత మహిళలకు ఓదార్పు లభించకపోగా, అడుగడుగునా అవమానాలు ఎదురుకావడం. రక్షణ కల్పించాల్సిన పోలీసుల నుండి చివరకు న్యాయవ్యవస్థ నుండి కూడా బాధిత మహిళలకు ఈ తరహా దుస్థితి ఎదురవుతోందన్నది ఒక అధ్యయన సారాంశం!

ఇలా ఎన్నాళ్లు? ఆకాశంలో సగమని కీర్తిస్తూనే అవమానాల ఘనంగా మార్చడం దేనికి సంకేతం? హింసించడం, వేధించడం, అవమానపరచడమే కాదు, అటువంటి సంఘటనలను చూసీ చూడనట్టుగా వ్యవహరించడం కూడా మనువాద, పురుషాహంకార భావజాలమే! ఈ విష సంస్కృతి నుండి, దాని కుక్కమూతి పిందెల నుండి మన సమాజం బయటపడాలి. అదే విధంగా మాటల మాయలో, నినాదాల ఉచ్చులో పడకుండా నిజమైన సాధికారితను సాధించుకోవడానికి మహిళాలోకం కదలాలి. అన్ని రంగాల్లో సాధించే ఆ సాధికారతే మహిళలకు నిజమైన రక్ష! ఆ లక్ష్య సాధన కోసం జరిగే పోరాటాల్లో భాగస్వాములు కావడం, బలపరచడం ప్రగతిశీల, అభ్యుదయ శక్తుల కనీస బాధ్యత!

మంచి మాట



భూమాత హక్కులను రక్షించడం అనేది... అత్యంత ముఖ్యమైన మానవ హక్కులను, సామాజిక న్యాయాన్ని రక్షించడం అవుతుంది. అదే మన కాలంలో అతి విశాలమైన శాంతి ఉద్యమం అవుతుంది.

- డా॥ వందనా శివ,
ప్రకృతి పరిరక్షణ కార్యకర్త.

Vandana Shiva

రాజ్యాంగంలో గవర్నర్లు ... నాటి చర్చలు ...

విశ్లేషణ



దుష్యంత్ దవే

ఇటీవలి కొన్ని సంవత్సరాలుగా రాజ్యాంగ నిబంధనలు, రాజ్యాంగ నైతికత వేగంగా ఆందోళనకరంగా హరించుకు పోతున్నాయి. వివిధ విభాగాల రాజ్యాంగ సంస్థలలో రాజ్యాంగ నైతికతా మూలాలు దెబ్బతినిపోవడం కనిపిస్తుంది. ఎన్నికల సంఘం (ఇ.సి), కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (సిఎజి) పని తీరు కూడా చాలా అసంతృప్తికరంగానే వుంటోంది. ఇక కొన్ని రాష్ట్రాల గవర్నర్లు (ప్రత్యేకించి బిజెపి యేతర రాష్ట్రాల గవర్నర్లు) వ్యవహరిస్తున్న తీరు రాజ్యాంగాన్ని దాని పరిమితులను కూడా బూటకంగా మార్చేస్తున్నాయి.

రాజ్యాంగం లోని 153వ అధికరణం ప్రకారం ప్రతి రాష్ట్రానికి ఒక గవర్నర్ వుండాలంటోంది. పరిపాలన గవర్నర్ పేరుతో జరగాలన్న 154వ అధికరణం ప్రకారం రాష్ట్ర పాలనాధికారం గవర్నర్ పేరిట సాగుతుంది ("ఆయన ప్రత్యక్షంగా గానీ, లేక రాజ్యాంగం ప్రకారం ఆయన దగ్గర పని చేసే అధికారుల ద్వారా గాని వీటిని నిర్వహించవలసి వుంటుంది"). అయితే అదే సమయంలో ఉన్న చట్టం ప్రకారం మరే ఇతర అధికార వ్యవస్థకైనా సంక్రమించే అధికారాలలో గవర్నర్ తన చేతి లోకి తీసుకోరాదని 154 (2) (ఎ) నిషేధం విధిస్తున్నది. ఈ విషయంలో 163వ అధికరణం మరింత స్పష్టంగా చెబుతున్నది. "గవర్నర్‌కు సహాయ పడేందుకు, సలహాలిచ్చేందుకు ముఖ్యమంత్రి నేతృత్వంలో ఒక మంత్రివర్గం వుండాలి....రాజ్యాంగ పరంగా తన విచక్షణాధికారం వినియోగించ వలసిన, చర్య తీసుకోవలసిన సందర్భాలలో మాత్రమే ఇది వర్తించదు".

షంషేర్ సింగ్‌కూ పంజాబ్ ప్రభుత్వానికి మధ్య 1974లో నడిచిన కేసులో సుప్రీంకోర్టు ఈ విషయమై స్పష్టీకరణ ఇచ్చింది. 166వ అధికరణం ప్రకారం రాష్ట్రంలో పరిపాలన సజావుగా సాగడానికి అవసరమైన నిబంధనలు రూపొందించే విధంగా గవర్నర్ పని చేస్తారు. వాటినే పని పద్ధతులు అంటారు. అయితే కోర్టు మరో విషయం కూడా విశదం చేసింది. రాష్ట్రపతి లేదా గవర్నర్ తమ విధులు నిర్వహించడానికి సంతృప్తి చెందవలసిన అంశాలు కొన్ని వున్నాయి. ఉదాహరణకు 123, 213, 311 (2) (సి), 317, 352 (1), 356, 360 వంటి అధికరణాల విషయంలో వారు వ్యక్తిగతంగా సంతృప్తి చెందవలసి వుంటుంది. కేబినెట్ తరహా వ్యవస్థలో వారిలా సంతృప్తి చెందడమంటే రాజ్యాంగపరంగానే చూడాల్సి వుంది. అయితే లాంఛనమైన లేదా రాజ్యాంగపరమైన రాష్ట్రాధినేతగానే ఆయన సంతృప్తి చెందడమనే మాటను తీసుకోవాల్సి వుంది. కేవలం 356వ అధికరణం కింద మాత్రం గవర్నర్ రాష్ట్ర మంత్రివర్గ సలహాలు సూచనలకు వ్యతిరేకంగా కూడా తన విచక్షణను ఉపయోగించవచ్చు. మిగిలిన అన్ని అంశాల్లోనూ ఆయన మంత్రివర్గానికి అనుగుణమైన రీతిలోనే విచక్షణాధికారం ఉపయోగించాలి. రాజ్యాంగం ఒక సమాంతర పాలనా వ్యవస్థను ఏర్పాటు చేయాలని తలచలేదు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలు ఎన్నుకున్న మంత్రులే కార్యనిర్వాహక వర్గం తీసుకునే ప్రతి చర్యకు బాధ్యత వహించవలసి వుంటుంది. రాష్ట్రాలలో బాధ్యతాయుతమైన ప్రభుత్వమంటే ఎన్నికైన మంత్రివర్గమే.



> నిజంగా గవర్నర్‌కు రోజువారీ పాలనా వ్యవహారాలలో తల దూర్చే అధికారం లేదు. అలాగే శాసనసభ ఆమోదించిన బిల్లులకు తన ఆమోద ముద్ర నిలిపివేసే అధికారమూ లేదు. కానీ ఈ రోజున ప్రత్యేకించి ప్రతిపక్ష పార్టీలు పాలించే రాష్ట్రాలలో జరిగే తంతు గవర్నర్లు రాజ్యాంగాన్ని బేఖాతరు చేయడం తప్ప మరొకటి కాదు. బిజెపి పాలిత రాష్ట్రాలలో గవర్నర్లు తమ విధుల నిర్వహణ గురించి కిమ్మనకపోవడం ఆశ్చర్యకరం. సిబిఐ, ఇ.డి వంటి దర్యాప్తు సంస్థలు ఇప్పుడు వ్యవహరిస్తున్న తీరును కొంతైనా అర్థం చేసుకోవచ్చునేమో గానీ గవర్నర్లు ఇలా వ్యవహరించడం ఎలా సాధ్యమో బొత్తిగా అర్థం కాదు. ఈ పరిస్థితిని న్యాయ వ్యవస్థ సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చేస్తుందని ఆశించడం తప్ప చేయగలిగింది లేదు, దారుణమైన ఈ పోకడలను అరికట్టడం అప్పుడే సాధ్యం.

ఈ విషయంలో రాజ్యాంగ పరిషత్తు చర్చలు కూడా స్పష్టతనిస్తున్నాయి. 1949లో చర్చకు ఉద్దేశించిన 130వ అధికరణంపై ప్రొఫెసర్ కె.టి.షా ఇలా చెప్పారు: ఒక గవర్నర్ రాజ్యాంగ అధికరణలు, తదుపరి పేర్కొన్న నిబంధనల మేరకు వ్యవహరించడం తప్పనిసరి చేయాలి. అంటే మంత్రివర్గ సలహా మేరకు పని చేయాలని చెప్పాలి. గవర్నర్‌ను రాష్ట్రపతి నియమించాలా లేక నేరుగా ఎన్నిక కావాలా అని చాలా వేడి వేడి చర్చ జరిగింది. ఇదో సమాంతర రాష్ట్రాధికార వ్యవస్థకు దారి తీస్తుందేమోననే భయంతో రాజ్యాంగ పరిషత్తు గవర్నర్‌ను రాష్ట్రపతి నియమించాలని స్పష్టంగా తీర్మానం చేసింది. గవర్నర్‌కు ఇచ్చిన అధికారాలు తక్కువైనా...తను మంచివాడైతే చాలా మంచి పనులు చేసే అవకాశం వుంటుంది. అదే చెడ్డ గవర్నర్ అయితే పెద్ద అధికారాలేమీ లేకున్నా చాలా చెరుపు కూడా చేయొచ్చునని పి.కె.సేన్ వ్యాఖ్యానించారు. ఆయా విషయాలలో తల దూర్చడం ద్వారా గవర్నర్ ప్రజాస్వామ్య భావనను బలోపేతం చేస్తారా లేక దెబ్బ తీస్తారా అన్నది ప్రశ్న. గవర్నర్ కేవలం రాజ్యాంగబద్ధ అధిపతిగా మాత్రమే వుండాలని మేము నిర్ణయించాము. యంత్రాంగం పని చేయడానికి అవసరమైన కందెనలా వుండి అన్ని చక్రాలు సక్రమంగా తిరగడానికి ఉపకరించే రీతిలో తను వుండాలని, ఊరికే తల దూర్చే విధంగా గాక స్నేహపూర్వక జోక్యంలా తన పాత్ర వుండాలని భావించాము'.

"ఈ విషయంలో నాకు స్వయంగా చేదు అనుభవం వుంది. రాష్ట్ర ప్రధాని (అప్పట్లో అలా అనేవారు)గా వున్నప్పుడు గవర్నర్ మా పార్టీని విచ్ఛిన్నం చేయాలని చూశారు, ఏకకాలంలో మీరు ప్రజాస్వామ్యం, నియంతృత్వం రెండూ కొనసాగించలేరు - అంటూ విశ్వనాథదాస్ వివరించారు. అన్ని విషయాలు చూసిన మీదట గవర్నర్‌ను కేంద్రమే నియమించడం మంచిదని చెప్పాలి. తను స్థానిక రాజకీయ పార్టీల తాపత్రయాలు, అసూయల బెడదలేని వారై వుండాలి" అన్నారు కె.ఎం.మున్షీ ఈ విషయమై బి.ఆర్.అంబేద్కర్ కూడా ఇలా చెప్పారు: గవర్నర్‌కు ఎలాంటి బాధ్యతలు వుండరాదని రాజ్యాంగ పరిషత్తు భావించిన విషయం సభలో అందరికీ తెలుసు. మామూలు మాటల్లో చెప్పాలంటే తన విచక్షణను బట్టి లేక వ్యక్తిగత తీర్పును బట్టి చేయవలసిన పనులేవీ గవర్నర్‌కు వుండకూడదు. నూతన రాజ్యాంగ సూత్రాల ప్రకారం ఆయన అన్ని విషయాలలో తన మంత్రివర్గం సలహానే అనుసరించి పని చేయాల్సి వుంటుంది. కనుక గవర్నర్‌ను ఎన్నుకోవాలా లేక నియమించాలా అన్నది ఈ సభ ముందున్న సమస్య కాదు. గవర్నర్ గనక కేవలం రాజ్యాంగ పరిధికే పరిమితం అయ్యేట్టయితే ఈ చట్టంలో మనం స్పష్టంగా పొందుపర్చిన అధికారాలు గాక మరే అధికారం ఇవ్వకపోయేట్టయితే తనను పైనుంచి నియమించాలనే ఈ సూత్రంపై నాకెలాంటి మౌలిక ప్రాథమిక అభ్యంతరం లేదు.

143 (ఇప్పుడు 163) అధికరణంపై 1949 జూన్ ఒకటిన మాట్లాడుతూ ప్రొఫెసర్ షా మంత్రివర్గంలో అనుసరించే పద్ధతులు, సంప్రదాయాలు ఏమైనప్పటికీ ఏ నిర్ణయాలు తీసుకున్నప్పటికీ గవర్నర్‌కు సంబంధించినంత వరకూ మాత్రం ముఖ్యమంత్రిదే బాధ్యతగా వుండాలని నేను భావిస్తున్నాను. తన సహచరులుగా ఎవరుండాలి తొలగించాల్సివస్తే ఏం చేయాలి అన్నది గవర్నర్‌కు సలహా ఇవ్వాల్సింది ఆయనే. గవర్నర్‌కు కొన్ని విచక్షణాధికారాలు ఎందుకు ఇవ్వాల్సి వచ్చిందో సమర్థిస్తూ అంబేద్కర్ అవి చాలా పరిమితమైనవని పేర్కొన్నారు. "మన రాజ్యాంగం చెబుతున్న ప్రకారం చేయవలసినవి తప్ప అని అది స్పష్టం చేస్తున్నది. కనుక 143వ అధికరణాన్ని గవర్నర్‌కు సంబంధించి కేటాయించబడిన నిబంధనలతో కలిపి చదువుకోవాల్సి వుంటుంది. అంతేగాని ఇష్టానుసారం తను అనుకున్నది చేసేవిధంగా మంత్రివర్గం ఇచ్చే సలహాలను తోసిపుచ్చవచ్చునని చెప్పే సాధారణ అధికారం కాదు". 147 (ఇప్పుడు 167) కింద గవర్నర్‌కు ఇచ్చిన అధికారాలపై ఒక సభ్యుడు వెలిబుచ్చిన సందేహాలకు సమాధానంగా అంబేద్కర్ దీనివల్ల ఎలాంటి జోక్యానికి అవకాశం వుండదని స్పష్టం చేశారు. ఒక గవర్నర్ చేయవలసిన విధులు నిర్వహించడానికి అవసరమైన అంశాలనే ఇది అందిస్తున్నది. మంచి గవర్నర్ ఎవరైనా చేయవలసిన పనులే అవి. గవర్నర్ తనకు తానుగా ఏమీ చేయలేరనీ, మంత్రివర్గ సలహా మేరకు మాత్రమే తను నడుచుకోవలసి వుంటుందనీ మా మిత్రుడు అర్థం చేసుకుంటే అప్పుడు యథార్థ చిత్రం తన ముందు తెరచుకుంటుంది...అని రాజ్యాంగ పరిషత్తు సభ్యుడైన టి.టి.కృష్ణమాచారి చెప్పారు.


ఈ చర్చల వివరాలు గవర్నర్ పాత్ర, అధికారాలు, విధుల గురించి స్పష్టమైన అవగాహననిస్తాయి. నిజంగా గవర్నర్‌కు రోజువారీ పాలనా వ్యవహారాలలో తల దూర్చే అధికారం లేదు. అలాగే శాసనసభ ఆమోదించిన బిల్లులకు తన ఆమోద ముద్ర నిలిపివేసే అధికారమూ లేదు. కానీ ఈ రోజున ప్రత్యేకించి ప్రతిపక్ష పార్టీలు పాలించే రాష్ట్రాలలో జరిగే తంతు గవర్నర్లు రాజ్యాంగాన్ని బేఖాతరు చేయడం తప్ప మరొకటి కాదు. బిజెపి పాలిత రాష్ట్రాలలో గవర్నర్లు తమ విధుల నిర్వహణ గురించి కిమ్మనకపోవడం ఆశ్చర్యకరం. సిబిఐ, ఇ.డి వంటి దర్యాప్తు సంస్థలు ఇప్పుడు వ్యవహరిస్తున్న తీరును కొంతైనా అర్థం చేసుకోవచ్చునేమో గానీ గవర్నర్లు ఇలా వ్యవహరించడం ఎలా సాధ్యమో బొత్తిగా అర్థం కాదు. ఈ పరిస్థితిని న్యాయ వ్యవస్థ సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చేస్తుందని ఆశించడం తప్ప చేయగలిగింది లేదు, దారుణమైన ఈ పోకడలను అరికట్టడం అప్పుడే సాధ్యం.

/ వ్యాసకర్త : సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది /
/ 'ద హిందూ' సౌజన్యంతో /

దర్యాప్తు సంస్థలా..? బిజెపి వదిలిన బాణాలా..?

చర్చ

దేశంలో బిజెపి ఏలుబడిలో అప్రజాస్వామిక, అనైతిక రాజకీయం నడుస్తున్నది. కేంద్ర ప్రభుత్వం అధికార సంస్థలను దుర్వినియోగం చేస్తూ ప్రతీకార రాజకీయాలకు పాల్పడుతున్నది. బిజెపి ఇలాంటి ప్రతీకార రాజకీయాలను ఇప్పటికే దేశవ్యాప్తం చేసింది. ప్రత్యర్థులను ముప్పుతిప్పలు పెట్టడానికి... తమ పార్టీ లోకి వలసలను ప్రోత్సహించడానికి...విననివారిని జైలు పాల్జేయడానికి కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ...ఇ.డి, ఐ.టి, ఎన్ఐఎ, సిబిఐలను వినియోగించుకుంటున్నదని అందరికీ తెలిసిన విషయమే. 2014 తర్వాత ఈ సంస్థల కార్యకలాపాలను పరిశీలిస్తే మనకు ఈ విషయం ఇట్టే అర్థమైపోతుంది. బిజెపి అధికారంలోకి వచ్చాక సిబిఐ 115కి పైగా ప్రతిపక్ష నాయకులపై కేసులు నమోదు చేసింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ 120 మందికి పైగా రాజకీయ నేతలపై కేసులు పెట్టి దర్యాప్తు చేస్తుండగా, ఇందులో 115 మంది ప్రతిపక్షనేతలే. ఈ సంస్థలు ప్రతిపక్షాలకు చెందిన నాయకులను టార్గెట్ చేస్తున్నాయి. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా, రాహుల్, 'ఆప్' కీలక నాయకులు సత్యేంద్ర జైన్, మనీష్ సిసోడియా, జార్ఖండ్ సి.ఎం హేమంత్ సోరేన్, శివసేన కీలక నేత సంజయ్ రౌత్, ఎన్‌సిపి నేత నవాబ్ మాలిక్, రాజస్థాన్ సి.ఎం అశోక్ గెహ్లాట్, సోదరుడు అగ్రసేన్ గెహ్లాట్ వంటి నేతలను టార్గెట్ చేసి ముప్పుతిప్పలు పెట్టింది. కర్నాటకలోనూ కాంగ్రెస్ జేడీయూ కీలక నేతల ఇళ్లపై ఐ.టి దాడులు నిర్వహించింది. మరోవైపు బిజెపి విధానాలను తీవ్రంగా విమర్శించే దాదాపు 20 మంది మేధావులు, ప్రొఫెసర్లు, పౌర హక్కుల నేతలను ఎన్ఐఎ అరెస్టు చేసి జైళ్లలో పెట్టింది. ఇంకా నల్ల వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా ఆందోళనలు చేసిన రైతు సంఘాల నేతలకు ఉగ్రవాదులతో సంబంధాలు వున్నాయంటూ ఎన్ఐఎ టార్గెట్ చేసింది. అయితే వేధించడమే తప్ప ఇ.డి నమోదు చేస్తున్న కేసుల్లో కన్విక్షన్ రేటు (ముద్దాయిలకు శిక్ష పడటం) మూడు శాతం కన్నా తక్కువగా ఉన్నట్టు ప్రభుత్వ గణాంకాలే స్పష్టం చేస్తున్నాయి. అయితే బిజెపి ఇలా ప్రతీకార రాజకీయాలను పాల్పడుతున్నందున ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, కేరళ, మిజోరం, పంజాబ్, రాజస్థాన్, బెంగాల్, మేఘాలయ, తెలంగాణ రాష్ట్రాలు సిబిఐకి యథేచ్ఛగా ప్రవేశించే సాధారణ అనుమతిని రద్దుచేశాయి.



మీడియా పైనా....

మీడియాను తన గుప్పిట ఉంచుకోవడానికి బిజెపి మీడియా సంస్థలపై కూడా సిబిఐ, ఇ.డి, ఐటీ లతోపాటు స్థానిక పోలీసులను దాడులకు ఉసిగొల్పుతున్నది. గతంలో ఎన్‌డి టీవీని టార్గెట్ చేసి, ఆ సంస్థ యజమానులు ప్రణయ్ రాయ్, రాధికా రాయ్‌పై కేసులు నమోదు చేసింది. బిజెపి కి నచ్చని కథనాలు రాసినందుకు "ద వైర్" న్యూస్ వెబ్‌సైట్ ఎడిటర్లు కె.వేణు, జాహ్నవి సేన్, వ్యవస్థాపకుడైన సిద్ధార్థ వరదరాజన్ ఇళ్లలో ఢిల్లీ క్రైమ్ బ్రాంచ్ పోలీసులు సోదాలు నిర్వహించారు. డిజిటల్ మీడియాను సైతం తన నియంత్రణలో ఉంచేందుకు బిల్లులను తీసుకొస్తున్నది. అంతర్జాతీయంగా పత్రికా స్వేచ్ఛ సూచీని పరిశీలిస్తే 180 దేశాలకు గాను భారత ర్యాంకు 150. అదే 2021లో ఇది 142గా ఉంది. 2016లో 133గా ఉంది.

బిజెపి లోకి వెళ్లగానే పునీతులు!

ప్రతిపక్షాలకు చెందిన నాయకులు బిజెపి లోకి వెళ్లగానే పునీతులుగా మారిపోతున్నారు. పార్టీ మారాక ఆ నాయకులపై ఇ.డి, సిబిఐ, ఐటి వంటి సంస్థలు ఎలాంటి దాడులు చేయడం లేదు. ఇందుకు అనేక ఉదాహరణలు ఉన్నాయి. అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ, టీఎంసీ సీనియర్లు సువేందు అధికారి వంటి నేతలను ఇందుకు ఉదాహరణగా చెప్పవచ్చు. టిడిపి లో ఉన్నప్పుడు సుజనా చౌదరి, సీఎం రమేశ్ అనేక కేసులు ఎదుర్కొన్నారు. వారు బిజెపి లో చేరగానే కేసులన్నీ మాయమయ్యాయి. మధ్యప్రదేశ్‌కు చెందిన కాంగ్రెస్ నాయకుడు జ్యోతిరాదిత్య సింధియాపై భూ ఆక్రమణ కేసులున్నాయి. 2020 మార్చిలో ఆయన బిజెపి లో చేరగానే ఆ కేసే మూతపడింది. కేంద్రాన్ని ప్రశ్నించేవారిని వేధించడం, తమ పార్టీలో చేరగానే కేసులను పక్కకు పెట్టడం ఆనవాయితీగా మారింది.

ఇప్పుడు టిఆర్ఎస్ మంత్రులు, కీలక నేతలను టార్గెట్ చేస్తూ ఇ.డి, ఐటీ ని ప్రయోగిస్తున్నది. ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీలను టార్గెట్ చేస్తూ దాడులు చేస్తున్నది. ఎంపీ నామా నాగేశ్వరరావు ఆస్తులను అటాచ్ చేశారు. లిక్కర్ స్కామ్‌లో ఎమ్మెల్సీ కవిత పేరును తీసుకొచ్చారు. లిక్కర్ స్కామ్ పేరుతో సిబిఐ కూడా ఎంట్రీ ఇవ్వాలనుకున్నా... దానికి అనుమతి నిరాకరిస్తూ తెలంగాణ ప్రభుత్వం జీవో తీసుకొచ్చింది. ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారంలో బిజెపి కుట్రలపై సిట్ ఏర్పాటు చేసి సంబంధిత బిజెపి నాయకులు, సన్నిహితులకు నోటీసులు జారీ చేస్తున్నది.

ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్ వంటి రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధికారంలో ఉంది. అయితే కెసిఆర్ చూపిస్తున్నటువంటి ధైర్యం కూడా కాంగ్రెస్ నేతలు చూపించలేకపోతున్నారు. అదే సమయంలో కేంద్ర సంస్థలన్నీ ఆ పార్టీ నాయకులను టార్గెట్ చేస్తూ ముందుకెళ్తున్నాయి. కేంద్ర దర్యాప్తు సంస్థలన్నీ బిజెపి జేబు సంస్థలుగా మారిపోవడం విషాదం. కాగా ఇది ప్రజాస్వామ్యానికే ప్రమాదకరంగా మారింది.

- ఫిరోజ్ ఖాన్,
సెల్:9640466464

జనవాక్యం

పర్యావరణంపై మరో ప్రతిజ్ఞ

ఈజిప్టులో ప్రపంచ దేశాల 27వ పర్యావరణ సదస్సు ముగిసింది. కాప్-27గా పిలవబడే ఈ సదస్సులో పర్యావరణ దుష్ప్రభావాలకు లోనయ్యే దేశాలకు పరిహారం రూపంలో సాయం చెయ్యడానికి ఉద్దేశిస్తూ ఒక నిధిని ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించారు. కేవలం ప్రకటన చేశారు తప్పించి ఆ నిధుల సమీకరణ, వినియోగం తదితర విధివిధానాలు చర్చించలేదు. ఆ విషయాలన్నీ వచ్చే ఏడాది యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో జరగబోయే సదస్సులో చర్చించి నిర్ణయిస్తారు. ప్రస్తుతానికి ఇలాంటి ఒక నిధి ఏర్పాటు చెయ్యాలన్న భావన రావడమే గొప్ప అన్నట్టుంది పరిస్థితి. పేద దేశాలన్నీ కలిసి ఒత్తిడి తీసుకురావడం వల్లనే ధనిక దేశాలు ఒప్పుకున్నాయి గానీ నిధి కార్యరూపంలో రావడానికి ఎంత మొరాయిస్తాయో చూడాల్సి ఉంది. ఎందుకంటే ఇప్పటివరకూ జరుగుతున్న సదస్సుల్లో తీసుకుంటున్న నిర్ణయాలు పేపర్ మీదనే ఉంటున్నాయి తప్పించి అమలు కావడం లేదు. పర్యావరణంపై అమెరికా, యూరోప్ లాంటి దేశాల చిత్తశుద్ధి అలాంటిది మరి. ఆయా దేశాలు పర్యావరణంపై పూచీ పడడం, పడాల్సి ఉండడం పరోపకారి బుద్ధితో చెయ్యాల్సిన కార్యక్రమం కాదు. చేసిన నష్టానికి పరిహారంగా చెయ్యాల్సిన నైతిక బాధ్యత. తప్పించుకోలేని బాధ్యత. పారిశ్రామికీకరణ పేరుతో పర్యావరణాన్ని ధ్వంసం చేసి ప్రపంచాన్ని ప్రమాదం లోకి నెట్టినందుకు చెల్లించాల్సిన మూల్యం. తిలాపాపం తలా పిడికెడు మాదిరిగా అన్ని దేశాలకూ ఇందులో బాధ్యత ఉన్నా, ఎక్కువ నష్టం కలగజేసినందుకు ధనిక దేశాలు ఎక్కువ పూచీ పడాలి. ప్రకృతి నుండి వారు తోడుకున్నంతా తోడుకొని ఇప్పుడు అన్ని దేశాలకూ ఉద్గారాల విషయమై ఒకే స్థాయి నియమాలు వర్తిస్తాయనడం మోసం. మిగిలిన దేశాలు ప్రత్యామ్నాయ ఇంధనం వైపు మళ్లడానికి నిధులెక్కువ అవసరం. ఆ సాయం వారందించాలి. అలాగే పర్యావరణం దెబ్బతిన్న కారణంగా ప్రకృతి వైపరీత్యాలు పెరుగుతు న్నాయి. ఒక వైపు వరదలు మరో వైపు కరువులతో ప్రపంచదేశాలు నష్టపోతున్నాయి. నష్టానికి బాధ్యత వహిస్తూ వారికి అందించబోయే నిధుల్లో ధనిక దేశాలు పెద్ద పాత్ర తీసుకోవాలి. పూర్వ పారిశ్రామికీకరణ దశలో భూగోళానికి ఉన్న వేడిమికి ఒకటిన్నర సెంటిగ్రేడు కన్నా ఎక్కువ పెరగనియ్యరాదన్న గమ్యం చేరుకోవాలంటే ... పర్యావరణానికి ఎక్కువ నష్టం కలుగజేసిన, కలుగజేస్తున్న అమెరికా, యూరోప్ తదితర ధనిక దేశాలే అందులో ముఖ్య భూమిక పోషించాలి.

- డా. డి.వి.జి.శంకరరావు,
మాజీ ఎంపీ, పార్వతీపురం.

ఖర్చు లేకుండా పెళ్లి

ఈరోజు సమాజంలో పిల్లలకు వివాహాలు చెయ్యటమంటే తల్లిదండ్రులకు పెద్ద ఖర్చుతో కూడుకున్నది గానూ, ఒకరిని చూసి ఒకరు లక్షలు లక్షలు అప్పులు చేసి కళ్యాణ మండపాలు, బ్యాండుమేళాలు, పురోహితుడు, ముహూర్తాలు, కట్న కానుకలు, కాలి గోళ్ళు తియ్యటాలు, అల్లుడికి కాళ్ళు కడగటాలు కనిపిస్తాయి. ఇవన్నీ లేకుండా 50 రూపాయల ఖర్చుతో కూడా వివాహాలు చేసుకోవచ్చు. అబ్బాయి అమ్మాయి ఒకరినొకరు ఇష్టపడిన తరువాత, రెండు ఫొటోలు, ఇద్దరివీ నేటివిటీ సర్టిఫికెట్లు తీసుకుని రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్ళి స్పెషల్ మ్యారేజ్ యాక్ట్ 1954 కింద దరఖాస్తు తీసుకుని పూర్తిచేసి కార్యాలయంలో ఇవ్వాలి. ఇద్దరు పెద్దమనుషుల సంతకాలు పెట్టాలి. ఫీజు బహుశా 50 రూపాయలు వుంటుంది. 31 రోజున కార్యాలయానికి వెళ్తే రిజిస్ట్రార్ పెళ్ళి అయినట్లు సర్టిఫికెట్ ఇస్తాడు. ఇది చాలా సులువైన పద్ధతి. అందరం ఇలాంటి వివాహాలను ప్రోత్సహించాలి. తరువాత రిసెప్షన్ మన వీలును బట్టి చేసుకోవచ్చు. లేదా ఆదివారం అందరికి అనుకూలమైన రోజు దండల మార్పిడి వివాహం చేసుకుని రిజిస్ట్రాఫీసుకి వెళ్ళి రిజిస్టర్ చేసుకోవచ్చు.

- నార్నె వెంకట సుబ్బయ్య,
హేతువాద సంఘం అధ్యక్షుడు.

కేంద్రం సాయం చెయ్యదనేగా!

'డబుల్ ఇంజిన్ సర్కార్'తోనే ప్రజలకు మేలు జరుగుతుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, అమిత్ షా, ఇతర కేంద్ర మంత్రులు తరచుగా ఎలక్షన్ / పార్టీ మీటింగులలో అంటున్నారు, ఇది రాజ్యాంగానికి విరుద్ధం. సభ్య సమాజానికి మాయని మచ్చ. అంటే ప్రజామోదంతో ఇతర పార్టీల ద్వారా గెలిచి ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్రం ఎటువంటి న్యాయం చేయదని కుండబద్దలు కొట్టినట్లు చెప్పినట్టేనా. అంటే అటువంటి పార్టీల విన్నపాలు విజ్ఞప్తులు, హక్కుగా పొందాల్సిన ప్రాజెక్టులు కేంద్ర సహాయం శాశ్వతంగా కోల్పోతారని శాసించడమేనా? అందుకే అటువంటి రాష్ట్రాలకు కేంద్రం శూన్య హస్తాలు చూపిస్తున్నదని ప్రజలు భావించాలా? ఇదేనా నేటి కేంద్ర ప్రభుత్వ పాలకుల తీరు. ఇప్పటికైనా చీఫ్ ఎలక్షన్ కమిషనర్, సుప్రీం కోర్ట్ చీఫ్ జస్టిస్ సత్వరమే స్పందించి డబుల్ ఇంజిన్ సర్కార్ పదాన్ని, అదే అర్థాన్నిచ్చే పదాల్ని ఎలక్షన్ మీటింగులలో వాడకూడదని ఉత్తర్వులు జారీ చేయాలని భారత ప్రజల, ఓటర్ల విజ్ఞప్తి. విన్నపం.

- డి.వి.ఆర్ కృష్ణ

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps@ gmail.com

రెండో రోజూ కొనసాగిన ఐటి దాడులు

- మల్లారెడ్డి కుమారుడికి అస్వస్థత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి ఇంట్లో రెండో రోజు ఐటీ సోదాలు కొనసాగాయి. ఈ సోదాల్లో నగదు, పలు కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. సోదాలు జరుగుతున్న సమయంలో మంత్రి పెద్ద కుమారుడు మహేందర్‌రెడ్డి ఛాతిలో నొప్పితో స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. దాంతో అతన్ని సూరారంలోని మల్లారెడ్డి నారాయణ హృదయాలయం ఆస్పత్రికి తరలించారు. అయితే, మంత్రి ఆస్పత్రికి వెళ్లకుండా ఐటి అధికారులు అడ్డుకున్నట్లు తెలిసింది. దాంతో వారితో మల్లారెడ్డి వాగ్వాదానికి దిగినట్లు సమాచారం. అనంతరం మంత్రి సూరారంలోని ఆస్పత్రి వద్దకు చేరుకోగా అక్కడ భారీగా పోలీసు భద్రత ఏర్పాటు చేశారు. మంత్రిని లోపలికి అనుమతించకపోవడంతో ఆయన ఆస్పత్రి ముందు కార్యకర్తలతో బైఠాయించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాజకీయ కక్షతో ఐటీ దాడులు చేపడుతున్నారని, తామేమైనా దొంగ వ్యాపారం చేస్తున్నామా? అని ప్రశ్నించారు. తన కొడుకుని సిఆర్‌పిఎఫ్ బలగాలతో కొట్టించారని, రాత్రంతా ఇబ్బంది పెట్టారని అన్నారు. ఇప్పుడు చూడటానికి వెళ్తుంటే అడ్డుకోవడం దారుణమని చెప్పారు. కక్షపూరితంగానే తమ కుటుంబంపై ఐటి దాడులకు దిగారని, దీని వెనుక బిజెపి కుట్ర ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐటి సోదాల్లో ఎలాంటి డబ్బులు పట్టుకోలేదని స్పష్టం చేశారు. మహేందర్‌రెడ్డికి హైపర్ టెన్షన్ వల్లే అస్వస్థతకు గురైనట్లు వైద్యులు చెప్పారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందన్నారు. మల్లారెడ్డి ఇద్దరు కుమారులు మహేందర్ రెడ్డి, భద్రారెడ్డి, అల్లుడు రాజశేఖర్ రెడ్డి, బంధువుల ఇళ్లలో తనిఖీలు నిర్వహించారు. రాజశేఖర్ రెడ్డి ఇంట్లోని ఎలక్ట్రానిక్ లాకర్లను ఐటీ అధికారులు తెరిచారు. అందులో లభించిన నగదును స్వాధీనం చేసుకున్నారు. అలాగే, మంత్రి నివాసంలో ఉన్న రెండు లాకర్లు తెరవాల్సి ఉందని, ఆ లాకర్లు తెరిచేందుకు ఢిల్లీ నుంచి ప్రత్యేక బృందం బయలుదేరిందని సమాచారం.

ప్రమాదంలో మతస్వేచ్ఛ

- అమెరికా మత స్వేచ్ఛా కమిషన్ నివేదిక వ్యాఖ్య

వాషింగ్టన్ : భారత్‌లో మతస్వేచ్ఛ, అందుకు సంబంధించిన మానవ హక్కులు ప్రమాదంలో పడ్డాయని అమెరికా అంతర్జాతీయ మత స్వేచ్ఛా కమిషన్ (యుఎస్‌సిఐఆర్‌ఎఫ్) పేర్కొంది. భారతదేశంలో మత స్వేచ్ఛకు సంబంధించిన వార్షిక మదింపు నివేదికను కమిషన్ మంగళవారం వెలువరించింది. గతంలో ఈ కమిషన్ వ్యాఖ్యలను, పరిశీలనలను భారత్ తిరస్కరించింది. భారతను ఆందోళనకరమైన దేశంగా భావించాల్సి వుందంటూ ఈ ఏడాది ప్రారంభంలో కమిషన్ తన నివేదికలో సిఫార్సు చేసింది. ఆ సిఫార్సును అమలు చేయడానికి అమెరికా విదేశాంగ శాఖ తిరస్కరించింది. ఈ ఏడాది ప్రారంభంలో చేసిన సిఫార్సులను తాజాపరుస్తూ మంగళవారం మరో నివేదిక వెలువరించింది. భారత్‌లో మతస్వేచ్ఛ పరిస్థితులు చాలా పేలవంగా వున్నాయని 2022నాటి నివేదికలో కమిషన్ పేర్కొంది. నిర్దిష్ట గ్రూపులను లక్ష్యంగా చేసుకుని విధానాలు రూపొందిస్తున్నారు, చట్టాలు చేస్తున్నారని పేర్కొంది. ముఖ్యంగా మతపరమైన మైనారిటీల గొంతులను నొక్కేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆ నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది.



రాహుల్‌గాంధీకి సొంత పార్టీ నేతల నిరసన సెగ



జైపూర్ : రాహుల్‌గాంధీ చేపడుతున్న భారత్ జోడో యాత్ర బుధవారం కాంగ్రెస్ పాలిత ప్రాంతమైన రాజస్థాన్‌కు చేరుకుంది. సొంత పార్టీ నేతల నుంచి ఆయనకు నిరసనలు ఎదురయ్యాయి. ప్రస్తుతం రాజస్థాన్‌లో అశోక్ గెహ్లాట్ ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ ప్రభుత్వం నాలుగేళ్ల పాలనను పూర్తి చేసుకుంది. ఇప్పుడు సచిన్ పైలెట్‌ను ముఖ్యమంత్రిని చేయాలంటూ గుర్జర్లు ఆందోళన చేపడుతున్నారు. "ఇది జరిగితేనే మిమ్మల్ని (రాహుల్‌గాంధీ) స్వాగతిస్తాం. లేకుంటే యాత్రను అడ్డుకుంటాం " అని గుర్జర్ నేత విజయ్ సింగ్ బైన్సా హెచ్చరించారు. 2019 సమయంలో కాంగ్రెస్ చేసిన ఒప్పందాన్ని అమలు చేయాల్సిన సమయం వచ్చిందని అన్నారు. గుర్జర్ల వ్యక్తిని సిఎంగా ఎంపిక చేయకపోవడంపై తమ కమ్యూనిటీ ఆందోళన చెందుతోందని అన్నారు. కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి అశోక్‌గెహ్లాట్‌కు మద్దతు తెలుపుతూ తిరుగుబాటు ప్రకటించిన ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని సచిన్ పైలెట్ అధిష్టానాన్ని కోరిన అనంతరం ఈ పరిణామం జరగడం గమనార్హం.

శ్రద్ధ హత్య కేసులో మరో ట్విస్ట్..

- ముక్కలు చేసి చంపేస్తాడని 2020లోనే ఫిర్యాదు

న్యూఢిల్లీ : శ్రద్ధా వాకర్ హత్య కేసులో రోజుకొక విషయం వెలుగుచూస్తోంది. శ్రద్ధా వాకర్‌ను ఆమె ప్రియుడు అఫ్తాబ్ అమీన్ పూనావాలా హత్య చేసి, 35 ముక్కలుగా నరికి శరీర భాగాలను ఢిల్లీ సమీపంలోని అటవీ ప్రాంతంలో విసిరేసిన సంగతి తెలిసిందే. తనకు ఇలాంటి పరిస్థితి ఎదురవుతుందని శ్రద్ధ ముందుగానే ఊహించింది. వీరిద్దరూ సహజీవనం చేస్తున్న సమయంలో రెండేళ్ల క్రితమే ఇద్దరి మధ్య గొడవ జరిగింది. అప్పుడు ఆమెను అఫ్తాబ్ కొట్టాడు. ఆమెకు ఊపిరాడకుండా చేసి, హత్య చేయాలనుకున్నాడు. 2020లో శ్రద్ధా వాకర్ ఆఫ్తాబ్ అమీన్ పూనావాలాపై మహారాష్ట్రలోని వసాయ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తనను చంపి ముక్కలుగా నరికివేస్తానని బెదిరించాడని అందులో పేర్కొంది. 2020లో తులింజ్ పోలీస్ స్టేషన్‌లో శ్రద్ధ ఫిర్యాదు చేసినట్లు మహారాష్ట్ర పోలీసులు ధ్రువీకరించారు. అయినప్పటికీ మళ్లీ అతనితోనే ఆమె ఎందుకు ఉందనేది ప్రశ్నార్థకంగా మారింది. అప్పట్లో ఆమె ఇచ్చిన ఫిర్యాదుపై ఇప్పుడు పోలీసులు ఆరా తీస్తున్నారు. దానిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు.

వరుసగా ఏడోసారి దేబా ఘన విజయం

ఖాట్మండు : పశ్చిమ నేపాల్‌లోని దాదెల్‌ధురా నియోజకవర్గం నుంచి వరుసగా ఏడవసారి ప్రధాని షేర్ బహదూర్ దేబా (77) భారీ మెజారిటీతో విజయం సాధించారు. స్వతంత్ర అభ్యర్థి, సమీప ప్రత్యర్థి సాగర్ ధాకల్ (31)కు 1302 ఓట్లు రాగా, దేబాకు 25,534ఓట్లు లభించాయి.

వచ్చే వారం నుంచి నాలుగు ప్రత్యేక ధర్మాసనాలు

సిజెఐ జస్టిస్ డివై చంద్రచూడ్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సుప్రీంకోర్టు పనితీరు మరింత సజావుగా, సాఫీగా సాగేందుకు వీలుగా నాలుగు అంశాలపై విచారణ చేపట్టేందుకు నాలుగు ప్రత్యేక ధర్మాసనాలను ఏర్పాటు చేస్తున్నామని సుప్రీం ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) జస్టిస్ డివై చంద్రచూడ్ తెలిపారు. బుధవారం ఆయన సుప్రీం కోర్టులో ఈ విషయాన్ని వెల్లడించారు. క్రిమినల్ అంశాలు, ప్రత్యక్ష-పరోక్ష పన్నుల అంశాలు, భూసేకరణ, మోటార్ యాక్సిడెంట్ క్లెయిమ్స్ ట్రిబ్యునల్ కేసులపై ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక ధర్మాసనాలు వచ్చే వారం నుంచి విచారణ ప్రారంభిస్తాయని తెలిపారు. భూసేకరణ వ్యవహారాలకు సంబంధించిన ధర్మాసనానికి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వం వహిస్తారని సిజెఐ చెప్పారు.

విద్యుత్ బిల్లును ఉపసంహరించకపోతే దేశవ్యాప్తసమ్మె

(మొదటి పేజీ తరువాయి)

ఆయిల్, గ్యాస్ ధరలను కేంద్ర మంత్రివర్గం నిర్ణయించేదనీ, ఇప్పుడు అన్ని రంగాలను ప్రయివేటీకరణ చేయడం వల్ల ఆయిల్, గ్యాస్ ధరలను అంబానీ, అదానీలు నిర్ణయిస్తున్నారని విమర్శించారు. విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరిస్తే కరెంటు ఛార్జీలనూ కార్పొరేట్లే నిర్ణయిస్తారని చెప్పారు. పార్లమెంట్‌లో తాము విద్యుత్ బిల్లును అడ్డుకుంటామని స్పష్టం చేశారు. విద్యుత్ సవరణ బిల్లు అప్రజాస్వామికమని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. ఎఐకెఎస్ ప్రధాన కార్యదర్శి హన్నన్ మొల్లా మాట్లాడుతూ విద్యుత్ సవరణ బిల్లు రైతులకూ వ్యతిరేకమైనదనీ, దీనివల్ల రైతులు తీవ్రంగా నష్టపోతారని తెలిపారు. ఎస్‌కెఎం ప్రధాన డిమాండ్లలో విద్యుత్ బిల్లు ఉపసంహరణ కూడా ఉందని గుర్తు చేశారు. పార్లమెంట్ మార్చ్‌లో ఆల్ ఇండియా పవర్ ఇంజనీర్స్ ఫెడరేషన్, ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, ఆల్ ఇండియా పవర్ డిప్లొమా ఇంజనీర్స్ ఫెడరేషన్, ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్, ఇండియన్ నేషనల్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ ఫెడరేషన్, వివిధ రాష్ట్రాలలోని అనేక ఇతర స్వతంత్ర సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ప్రధాన కార్యదర్శి తపన్ సేన్, వైసిపి రాజ్యసభ ఎంపి ఆర్. కష్ణయ్య, ఆప్ నేత గౌరవ్ మహేశ్వరీ, కోఆర్డినేషన్ కమిటీ నేతలు ప్రశాంత నంది చౌదరి, శైలేంద్ర దూబే, మోహన్ శర్మ, ఆర్‌కె త్రివేది, కుల్దీప్ కుమార్, పి.రత్నాకర్ రావు, అభిమన్యు ధంకర్, పద్మజిత్ సింగ్, కె.అశోక్ కుమార్, సమీర్ సిన్హా, ఆర్‌కె శర్మ, సద్రుద్దీన్ రాణా, తెలంగాణ విద్యుత్ ఉద్యోగులు, ఇంజనీర్స్ సంఘాల నేతలు కె.ఈశ్వరావు, వి.గోవర్ధన్, టి.రత్నాకర్, బీసీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఎం. చెన్నకేశవులు మృతి

విద్యుత్ ఉద్యోగుల ధర్నాలో పాల్గొనేందుకు ఢిల్లీకి వస్తున్న కడప జిల్లా, పొద్దుటూరు ఈఆర్ఓ సీనియర్ అసిస్టెంట్ ఎం. చెన్నకేశవులు మార్గమధ్యలోనే గుండెపోటుతో మరణించారు. రాజస్థాన్‌లోని బయన రైల్వేస్టేషన్‌లో మృతదేహాన్ని దించారు. అక్కడ నుంచి ఏపీకి తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

భూ వివాదాలు లేకుండా రికార్డుల ప్రక్షాళన

(మొదటి పేజీ తరువాయి)

ఎస్.వి సింగ్, ల్యాండ్ అడ్మిన్‌స్ట్రేషన్ ప్రత్యేక కార్యదర్శి జి.సాయిప్రసాద్, కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, పలువురు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

జనం అగచాట్లు

సిఎం పర్యటన సందర్భంగా సాధారణ జనం తీవ్ర ఇబ్బందుల పాలయ్యారు. ఆంక్షలు విధించడంతో నరసన్నపేట నుంచి రాకపోకలు సాగించేవారు అవస్థలకు గురయ్యారు. నరసన్నపేటలోకి బస్సులను అనుమతించకపోవడంతో వృద్ధులు, చంటి పిల్లలను ఎత్తుకుని మహిళలు రెండు కిలోమీటర్ల మేర నడిచి వెళ్లాల్సి వచ్చింది. సిఎం ప్రసంగం మధ్యలో కొందరు వెళ్లిపోయేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. పోలీసులతో వాగ్వాదానికి దిగి వారిని నెట్టుకుంటూ బయటకు వెళ్లిపోయారు. సభకు ఉపాధి కూలీలను సైతం తరలించారు. సిఎం ప్రయాణించే మార్గంలో దుకాణాలన్నింటినీ పోలీసులు మూయించారు.

సంక్షోభంలో వ్యవసాయం

(మొదటి పేజీ తరువాయి)

ఐదు లక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. రాష్ట్రంలో వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసినా, అవి బ్రోకర్లకు నిలయాలుగా మారాయని అన్నారు. ఎపి రైతు సంఘం పూర్వ కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ప్రాంతం వ్యవసాయం, సహకార రంగాలపై పూర్తిగా ఆధారపడేదని పేర్కొన్నారు. ఈ రంగాల నడ్డివిరిచేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్లకు అనుకూల విధానాలతో వెళ్తున్నాయని తెలిపారు. గతంలో రాజుల మాదిరిగా రాష్ట్రంపైకి అదానీ 'అశ్వమేధయాగం'తో భూములు, కొండలు, సముద్రాలు, పోర్టులన్నిట్లోనూ చొచ్చుకుపోతున్నారని విమర్శించారు. ఇప్పటికే కృష్ణపట్నం, గంగవరం పోర్టులపై కార్పొరేట్లకు పెత్తనం ఇచ్చేశారని తెలిపారు. అదానీ అటెండర్ ఫైలుతో ఎపికి వస్తే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సంతకాలు చేసి పంపడం తప్ప, వ్యతిరేకించే పరిస్థితి లేదని విమర్శించారు.

పాలపై జిఎస్‌టి దారుణం : వి.కృష్ణయ్య

పసిబిడ్డలు తాగే పాలపైనా జిఎస్‌టిని మోడీ సర్కారు విధించడం దారుణమని ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య అన్నారు. 'పాడి-పంటలు' అనే అంశంపై ముఖ్యవక్తగా ఆయన మాట్లాడుతూ లీటరు పాలకు రూ.4 సబ్సిడీ ఇస్తామని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ రాష్ట్రంలో ఎక్కడా అమలు కావట్లేదని తెలిపారు. దేశంలో తొమ్మిది కోట్ల కుటుంబాలు, రాష్ట్రంలో 50 లక్షల కుటుంబాలు ఆధారపడిన పాడి పరిశ్రమను ధ్వంసం చేసే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నాయని విమర్శించారు. ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ అధ్యక్షతన వహించిన ఈ సెమినార్‌లో సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కన్వీనర్ ఎ.అజశర్మ, ఉద్యోగ, సహకార సంఘాల కన్వీనర్ రెడ్డి వెంకటరావు ప్రసంగించారు.



మీ కోసం

దోసెల పిండి బాగా పులిస్తే అందులో రెండు చెంచాల గోధుమ పిండిని కలపాలి.

జీవన సౌరభం

జీవితంలో మనం నేర్చుకున్న ప్రతిదీ ఏదో ఒకరోజు ఉపయోగపడుతుంది.

తరువు తల్లిని రక్షించుకో!



నా పచ్చ దళముతో కాపలా కాసి
నా మేను సింహాసనమ్ముగా చేసి
రక్షింతు రక్షింతు ప్రాణాలు పోసి
తినడానికిత్తులే ధాన్యాల రాశి

నిన్ను రాజును చేసి పులకించినాను
నువ్వు నా బిడ్డవని పరవశించాను

ఆకువింజామరలతో నీకు విసిరి
ఆకలైతే పండ్లు తినుపింతు కొసరి
ఊడలను ఉయ్యాలగా నీకుగట్టి
కోయిలమ్మను జోలపాటకై పెట్టి

నిన్ను రాజును చేసి మురిసిపోయాను
నువ్వు నా బిడ్డవని కరిగిపోయాను


ఆటకై పచ్చికను నేలంత పరచి
పాటకై వెదురునే వేణువుగ మలచి
మాటలకు చిలుకమ్మనే వెంట పిలచి
తోటలో తేనెపట్టును దాచిపెట్టి

నిన్ను రాజును చేసి గర్వపడ్డాను
నువ్వు నా బిడ్డవని సర్వమిచ్చాను

పయనించకోయ్ హరిత కవచాన్ని వీడి
కత్తి, గొడ్డలి బూని చేయకోయ్ దాడి
బుగ్గి జేయును నిన్ను పుడమిపై వేడి
సాటి జీవుల చంపకుండుటే పాడి!

- కిలపర్తి దాలినాయుడు
సాలూరు

లెక్క తేల్చండి




చిన్నారులూ... ఇక్కడున్న పట్టికలో రకరకాల బొమ్మలున్నాయి. వాటిని నెంబర్లు గా గుర్తించి గణించాము. చివరి లైన్లో ఉన్న బొమ్మల అంకెల ఆధారంగా మీరు జవాబు రాబట్టండి.

జవాబు : 156

నేను గీసిన బొమ్మ



-ఎస్‌కె. సమీర,
6వ తరగతి,
జెడ్పిహెచ్ స్కూలు,
ఉప్పలపాడు,
అనంతసాగరం మండలం,
నెల్లూరు జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

'పోక్సో'.. వయసు పది.. కేసులు లక్షల్లో..

'ఒక చోట తల్లిదండ్రులు పని కోసం బయటకు వెళ్తారు. ఇంటి పక్కన ఉన్న పెద్దాయన వారి పాపపై కన్నేస్తాడు. ఇంకో చోట చాక్లెట్ ఆశచూపి చిన్నారిపై అత్యాచారం చేస్తాడు ఓ ప్రబుద్ధుడు. ఒక దగ్గర బడికి పంపించిన పాపాయిపై మాస్టారు కన్ను పడుతుంది. మరో దగ్గర స్కూలు బస్సులో వెళ్తున్న చిన్నారిపై డ్రైవరు దాడి చేస్తాడు' ఒకటా రెండా ఇలా ప్రతి రోజూ పసిపిల్లలై అఘాయిత్యాల వార్తలు చూస్తూనే ఉంటాం. బుడిబుడి నడకలు, బోసి నవ్వులు, ఆట పాటలతో గడపాల్సిన బాల్యం వారికి ఎన్నో మానని గాయాలను సొంతం చేస్తోంది. గట్టిగా అరిస్తేనే భయపడిపోయే వారికి లైంగిక దాడులు, అత్యాచారాలు, గర్భవిచ్ఛిత్తిలు నిత్యకృత్యమవుతున్నాయి. జాతీయ నేర గణాంకాల బ్యూరో తాజా నివేదిక ప్రకారం దేశంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాల కంటే మైనర్లపై జరుగుతున్నవే ఎక్కువని తేలింది.



మైనర్లపై జరుగుతున్న నేరాలను అరికట్టేందుకు 'లైంగిక నేరాల నుంచి పిల్లల రక్షణ' (పోక్సో) చట్టం ప్రవేశపెట్టి దశాబ్దం గడుస్తోంది. తాజా అధ్యయనం ప్రకారం మైనర్లపై అత్యాచార ఘటనలు అత్యధికంగా జరిగిన రాష్ట్రాల జాబితాలో మన ఆంధ్రప్రదేశ్ కూడా ఉంది.

మన రాష్ట్రంలో ...

రాజధాని ప్రాంతమైన విజయవాడలో పలుమార్లు అత్యాచారానికి గురైన బాలిక గర్భం దాల్చే వరకు ఆ ఘోరం వెలుగు చూడలేదు.

ఆ ఇంట్లో ఏడేళ్ల బాలిక నీరసంగా కనిపించడంతో ఏమైందని తల్లిదండ్రులు ఆరా తీశారు. పక్కింటి అంకుల్ నెమలి ఈకలు ఇస్తానని చెప్పి ఏదో చేశాడని ఆ బాలిక చెప్పింది. విని హతాశులైన తల్లిదండ్రులు పోలీస్ స్టేషనులో ఫిర్యాదు చేశారు. ఈ సంఘటన కూడా విజయవాడలోనే జరిగింది.

మాచవరం పోలీస్ స్టేషన్ పరిధి మారుతినగర్‌లో ఓ మైనర్ బాలికకు మాయ మాటలు చెప్పి లోబర్చుకున్న ఓ ప్రబుద్ధుడు ఆమెపై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఫలితంగా ఆమె గర్భం దాల్చింది. జులైలో ఈ ఘటన వెలుగు చూసింది.


నంద్యాల జిల్లా వెలుగోడు మండలానికి చెందిన ఓ బాలికపై ముగ్గురు యువకులు లైంగిక దాడికి పాల్పడిన ఘటన కూడా జులైలో వెలుగు చూసింది. దారివెంట నడుస్తున్న ఆమెను పక్కనే ఉన్న పొదల్లోకి లాక్కెళ్లిన దుండగులు అత్యాచారానికి పాల్పడ్డారు.

గుంటూరు నగర శివారు పరిధిలోని ఓ లాడ్జిలో తొమ్మిదేళ్ల బాలికపై ఇంజినీరింగ్ విద్యార్థులు సామూహిక అత్యాచారానికి పాల్పడిన ఘటన మే నెలలో వెలుగు చూసింది. ఐదారు నెలల్లో వెలుగు చూసిన ఎన్నో ఘటనల్లో ఇవి కొన్ని..

నగరాలు, పట్టణాల్లో జరిగిన ఈ నేరాలు కూడా ఆలస్యంగా రికార్డుల కెక్కుతుంటే ఇక గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించడానికే వణుకు పుడుతోంది.

అవగాహన కల్పించాలి

చాలామంది పిల్లలు లైంగిక వేధింపులు ఎదుర్కొంటున్నప్పటికీ వాటిని సరిగ్గా అంచనా వేయలేకపోతున్నారు. ఫిర్యాదులు తక్కువగా నమోదవ్వడానికి ఇదొక కారణం. ఇదే దుర్మార్గులకు అనుకూలంగా మారింది. ముద్దు చేయడం, లైంగిక చర్యకు ప్రేరణ, రహస్య భాగాలను తాకడం, నగ్నచిత్రాలను చూపడం వంటివి లైంగిక వేధింపుల్లో భాగమేననే విషయం చిన్నారులకు అర్థమయ్యేలా చెప్పాలి.





విచారించాల్సిన విషయమేమంటే చాలా సందర్భాల్లో లైంగిక వేధింపులకు గురిచేసే వారు కుటుంబ సభ్యులు లేదా దగ్గరి బంధువులై ఉండటం వల్ల ఫిర్యాదు చేయడానికి వెనకాడుతున్నారు.

చట్టం ఏం చెబుతోంది..

2012 నవంబరు 14న ప్రవేశపెట్టిన పోస్కో చట్టం కింద నమోదైన కేసుల్లో నిందితులకు శిక్షలు పడింది చాలా తక్కువ. పిల్లలపై జరిగే లైంగిక నేరాల విషయంలో ఏడాదిలోగా విచారణ పూర్తి కావాలని చట్టం చెబుతోంది. కానీ ఆచరణలో మాత్రం అది సాధ్యం కావడంలేదు. చట్టం ప్రవేశపెట్టిన నాటి నుండి నమోదైన కేసుల్లో ఇప్పటికీ నిందితులకు శిక్ష పడనివే ఎక్కువ.

సుప్రీం ఆదేశాలు బేఖాతరు..

బాలలపై లైంగిక నేరాలు పెరిగిపోవడాన్ని సుప్రీం కోర్టు తీవ్రంగా పరిగణించింది. కేసుల పరిష్కారానికి ఎదురవుతున్న అవరోధాలను తొలగించే దిశగా కేంద్రానికి, రాష్ట్రాలకు మార్గనిర్దేశం చేసింది. బాలలపై లైంగిక నేరాల నిరోధక చట్టం కింద వందకు మించి కేసులు నమోదైన చోట- ప్రతి జిల్లాలో కేంద్రప్రభుత్వ నిధులతోనే ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయాలని సుప్రీం ఆదేశించింది. వీటికి అవసరమైన నిధులు, మౌలిక వసతులను సమకూర్చడం, ప్రిసైడింగ్ అధికారి నియామకం, ఇతర ఉద్యోగులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ల నియామక బాధ్యత కూడా ప్రభుత్వాలు చూడాలని పేర్కొంది. కానీ చాలా చోట్ల సుప్రీం ఆదేశాలు కాగితాలకే పరిమితమయ్యాయి.

సమాజ దృక్పథం మారాలి



మన సమాజంలో నేరస్తులను నేరస్తులుగా చూడడం కంటే బాధితులను మానసికంగా వేధించడం ఎక్కువ. ఎక్కడైనా మైనర్‌పై అత్యాచార ఘటన వెలుగు చూసినప్పుడు శిక్ష పడిన నిందితుడి కంటే ఆ బాలిక, ఆమె కుటుంబం చాలా అభద్రతతో జీవించాల్సి వస్తోంది. బాధితురాలినే వేలెత్తి చూపుతున్నారు. భవిష్యత్తుపై భయానక పరిణామాలు దారితీసేలా ప్రవర్తిస్తుంటారు. వాళ్లపై జరిగిన దారుణాన్ని సరిగ్గా గుర్తించలేకపోవడం వల్లే చిన్న పిల్లలపై దాడులు జరగడంలో ప్రధాన కారణంగా కనపడుతోంది. తల్లిదండ్రులు లేని పిల్లలు, అనాథలు ఎక్కువగా టార్గెట్ చేసుకుంటు న్నారు. ఒక్కొక్కచోట ఉన్నత విద్యావంతుల కుటుంబాల పిల్లల్లో కూడా లైంగిక దాడుల విషయంపై బయటికి చెప్పడం లేదు. మొన్నీమధ్య విజయవాడలో ఒక పాప అపార్టుమెంటు మీద నుంచి దూకి ఆత్మహత్య చేసుకొంది. తన మీద జరుగుతున్న హింసను తల్లిదండ్రులతో చెప్పలేక తానే ప్రాణం తీసుకొంది. పిల్లలపై జరుగుతున్న నేరాలు ఆగాలంటే పిల్లలకు, తల్లిదండ్రులకు లైంగిక దాడులు, హింస వంటివాటిపై అవగాహన కల్పించాలి. నిందితులకు కఠినంగా శిక్షలు పడాలి. బాధితుల పట్ల సమాజ దృక్పథం మారాలి. స్త్రీలపై అవాకులు, చవాకులు మాట్లాడే ప్రవచనకర్తలు, నాయకుల వ్యాఖ్యలకు కళ్లెం వేయాలి. ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవాలి.

- డి. రమాదేవి,
ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి.



బాస్ పార్టీ పాట విడుదల

బాస్ పార్టీ లిరికల్ వీడియో సాంగ్‌టాలీవుడ్ స్టార్ హీరో చిరంజీవి టైటిల్ రోల్ చేస్తున్న చిత్రం 'వాల్తేరు వీరయ్య'. మాస్ ఎంటర్ టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రం నుంచి బాస్ పార్టీ సాంగ్ పూర్తి లిరికల్ వీడియోను మేకర్స్ విడుదల చేశారు. ఈ పాటను డీఎస్పీ స్వయంగా రాసి కంపోజ్ చేయడం విశేషం. ఈ పాటను నకాశ్ అజీజ్, డీఎస్పీ, హరిప్రియ పాడారు. పాటలో చిరంజీవి లుంగీ పూర్తి మాస్ గెటప్‌లో కనిపించారు. బాలీవుడ్ నటి ఊర్వశి రౌటేలా ఊరమాస్ స్టెప్పులతో అభిమానులకు కావాల్సిన వినోదాన్ని అందిస్తోంది. బాబీ (కేఎస్ రవీంద్ర) దర్శకత్వం వహిస్తున్న చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రంలో శృతిహాసన్ హీరోయిన్‌గా నటిస్తోంది. వాల్తేరు వీరయ్య 2023 జనవరి 13న సంక్రాంతి కానుకగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది.

20 మంది ఎఎస్‌పిలకు ఎస్‌పిలుగా ప్రమోషన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో 20 మంది అడిషనల్ ఎస్‌పిలకు ఎస్‌పిలుగా పదోన్నతులు కల్పించింది. ఈ మేరకు పదోన్నతులు పొందినవారికి కొత్తగా పోస్టింగులు ఇస్తూ రాష్ట్ర హోమ్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరి హరీష్‌కుమార్ గుప్తా బుధవారం ఉత్తర్వులు విడుదల చేశారు. అనకాపల్లి క్రైమ్ విభాగంలో అడిషనల్ ఎస్‌పిగా పనిచేస్తున్న బి లక్ష్మీనారాయణను ఇంటలిజెన్స్ ఎస్‌పిగా నియమించారు. ఏసిబిలో వున్న కెఎం మహేశ్వరరాజుకు మంగళగిరిలోని హెడ్‌క్వార్టర్స్‌లో ఎస్ఐబి ఎస్‌పిగా పోస్టింగ్ ఇచ్చారు. ఎసిబిలో వున్న ఎ సురేష్‌బాబును విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఎస్‌పిగా, శ్రీకాకుళం ఎఎస్‌పి కె శ్రీనివాసరావును విజయవాడ ట్రాఫిక్ డిసిపిగా, ఇంటలిజెన్స్‌లో వున్న ఎస్ శ్రీధర్‌కు ఎస్ఐబికి, విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్‌లో వున్న కె తిరుమలేశ్వరరెడ్డిని, ఎస్‌వి మాధవరెడ్డిని అదే విభాగంలో ఎస్‌పిలుగా పోస్టింగ్ ఇచ్చారు. ఎన్‌టిఆర్‌జిల్లా ఎస్ఐబిలో వున్న ఎం సత్తిబాబును విజయవాడ డిసిపిగా, అనంతపురం ఎస్ఐబిలో వున్న జె రామ్‌మోహన్ రావును ఎసిబి జాయింట్ డైరక్టర్‌గా నియమించారు. విజయనగరం ఎస్ఐబిలో వున్న ఎన్ శ్రీదేవిరావును ఇంటలిజెన్స్‌కు, ఇంటలిజెన్స్‌లో వున్న ఇ.అశోక్‌కుమార్‌కు ఇంటలిజెన్స్ ఎస్‌పిగా, రాజమండ్రి ఎస్ఐబిలో వున్న ఎ రమాదేవిని ఎసిబి జాయింట్ డైరక్టర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. సిఐడిలో వున్న కెజివి సరితను సిఐడి ఎస్‌పిగా, విశాఖ అడిషనల్ డిసిపి కె ఆనందరెడ్డిని విశాఖ డిసిపిగా, ఏలూరు ఎఎస్‌పి కె చక్రవర్తికి తిరుపతి ఆర్‌ఎస్ఎఎస్‌టి ఎఫ్‌లో పోస్టింగు ఇచ్చారు. గవర్నర్ వద్ద ఎడిసిగా వున్న కె ఈశ్వరరావుకు అక్కడే ఎస్‌పిగా పోస్టింగ్ ఇచ్చారు. నెల్లూరు క్రైమ్‌లో వున్న కె చౌడేశ్వరిని గుంతకల్ ఎస్ఆర్‌పికి, తిరుపతి ఎసిపి ఇ సుప్రజను ఎసిబి జాయింట్ డైరక్టర్‌గా, చిత్తూరులో వున్న కెవి శ్రీనివాసరావును ఇంటలిజెన్స్ ఎస్‌పిగా వేశారు. తిరుపతి ట్రాన్స్‌కోలో వున్న కె లావణ్యలక్ష్మిని తిరుపతి ట్రాన్స్‌కో ఎస్‌పిగా, తిరుపతిలో ఆర్‌ఎస్ఎఎస్‌టిఎఫ్‌గా వున్న ఎం సుందరరావును అనంతపురం పిటిసి ఎస్‌పిగా పోస్టింగ్ ఇచ్చారు.

టర్కీ, ఆఫ్ఘన్‌లో భూకంపం

కాబూల్ : టర్కీ, ఆఫ్ఘనిస్థాన్‌లో బుధవారం భూకంపం సంభవించింది. ఈ ఘటనల్లో పలువురికి గాయాలయ్యాయని, ఎటువంటి ప్రాణనష్టం సంభవించలేదని ఆయా దేశాల అధికారులు తెలిపారు. టర్కీలోని అంకారా నగరంలో భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై ఆరుగా నమోదైంది. భూకంప ప్రభావానికి డజ్‌సెలో 37 మంది, జోంగుల్‌డాక్‌లో ఆరుగురు, సకార్యా, ఇస్తాంబుల్, బోలులో ఒక్కొక్కరు గాయపడ్డారని టర్కీ అధికారులు తెలిపారు.

మార్చిలో ఐదుగురు ఎమ్మెల్సీలు పదవీ విరమణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మార్చి 29తో ఐదుగురు ఎమ్మెల్సీలు పదవీ కాలం ముగుస్తుందని రాష్ట్ర ఎన్నికల ముఖ్య అధికారి ముకేష్‌కుమార్ మీనా తెలిపారు. ఈ మేరకు బుధవారం డ్రాఫ్ట ప బ్లికేషన్ విడుదల చేశారు. పదవీ విరమణ చేసే వారిలో యండపల్లి శ్రీనివాసరెడ్డి, వెన్నపూస గోపాల్‌రెడ్డి, పివిఎన్ మాధవ్, విఠపు బాలసుబ్రహ్మణ్యం, కత్తి నరసింహారెడ్డి ఉన్నారని తెలిపారు. ఖాళీ అయ్యే స్థానాలకు సంబంధించి ఈనెల 23న డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. కౌన్సిల్ నియోజకవర్గాల వివరాలు ఇలా ఉన్నాయి.

కౌన్సిల్ నియోజకవర్గం	మొత్తం పోలింగ్	స్టేషన్లుమొత్తం
ఓటర్లుప్రకాశం,నెల్లూరు, చిత్తూరు, గ్రాడ్యుయేట్స్	320	3,64,288
కడప, అనంతపురం, కర్నూలు గ్రాడ్యుయేట్స్	358	2,91,089
శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ గ్రాడ్యుయేట్స్	297	2,43.903
ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు టీచర్స్	175	20,914
కడప, అనంతపురం, కర్నూలు టీచర్స్	173	22,256

24/7 విద్యుత్‌కు గండం

నిధులలేమితో డిస్కామ్‌కు కష్టాలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

24/7 విద్యుత్ సరఫరా చేయాలన్న లక్ష్యానికి నిధుల సమస్య వేధిస్తోంది. కేంద్రం నుంచి వచ్చిన నిధులు, రాష్ట్రం తన వాటాగా ఇవ్వాల్సిన నిధులను కూడా సమకూర్చకపోవడంతో పనుల్లో జాప్యం నెలకొంటోంది. ఇదే విషయాన్ని తూర్పు విద్యుత్ పంపిణీ సంస్థ రాష్ట్ర ప్రభుత్వానికి వివరించింది. తక్షణమే నిధులు ఇవ్వాల్సిన అవసరాన్ని కూడా అందులో పేర్కొంది.

ఇరవై నాలుగు గంటల విద్యుత్ కోసం డిస్కామ్ అధ్వర్యంలో ఇప్పటివరకు 478 కోట్లు వ్యయం చేశాయి. ఇందులో రూ. 334 కోట్లను తిరిగి రుణ దాతలకు చెల్లించాల్సి ఉంటుంది. దీనిలో ఐబిఆర్‌డి (ఇంటర్నేషనల్ బ్యాంక్ ఫర్ రీకన్‌స్ట్రక్షన్ అండ్ డెవలప్‌మెంట్) ద్వారా 200 కోట్లు, ఏఐఐబి ద్వారా 134 కోట్ల రూపాయలు ఉన్నాయి. అయితే ఐబిఆర్‌డికి వాటాకి సంబంధించి 82 కోట్లు, ఏఐఐబి వాటాకు సంబంధించి 54 కోట్లు కలిపి 136 కోట్ల నిధులు డిస్కామ్‌కు వచ్చినట్లు తెలిసింది. కాగా ఆయా రుణ సంస్థలకు డిస్కామ్ తాజాగా చెల్లించాల్సిన 198 కోట్లకుగాను 138 కోట్లకు రాష్ట్ర ఆర్థికశాఖ బడ్జెట్ రిలీజ్ ఆర్డర్‌ను విడుదల చేసింది. అయితే ఇది కేవలం బిఆర్‌ఓగానే మిగిలిపోయింది తప్ప నిధులు మాత్రం చేతికందలేదని డిస్కామ్ చెబుతోంది. ఇదే సమయంలో మరో 61 కోట్లకు కనీసం బిఆర్‌ఓ కూడా ఆర్థిక శాఖ ఇవ్వలేదని డిస్కామ్ అధికారులు చెబుతున్నారు. దీనివల్లనే పనుల్లో జాప్యం నెలకొంటోందని వారు చెబుతున్నారు.

జాకీ పరిశ్రమ ఏర్పాటుకు చర్యలు తీసుకోండి

- సిఎంకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అనంతపురం జిల్లా రాప్తాడులో గత ప్రభుత్వ హయాంలో పరిశ్రమను పెట్టేందుకు ముందుకు వచ్చిన జాకీ సంస్థ పొరుగురాష్ట్రానికి తరలిపోయిందని ముఖ్యమంత్రిగా రాష్ట్రంలోనే పరిశ్రమ పెట్టేలా చొరవతీసుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ కోరారు. ఈ మేరకు బుధవారం సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి లేఖ రాశారు. తమ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు నాయకులు డి జగదీష్, జిల్లా కార్యదర్శి సి జాఫర్‌లతో కలిసి రాప్తాడులో పరిశ్రమకు ఇచ్చిన భూములను పరిశీలించినట్లు తెలిపారు. ఈ ఫ్యాక్టరీ ఏర్పాటైతే ఆరువేల మందికి ఉపాధి అవకాశాలు వస్తాయని వివరించారు. జాకీ పరిశ్రమ ఏర్పాటు చేసుకునేందుకు రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి కంపెనీ ప్రతినిధులను రూ 10కోట్లను డిమాండ్ చేయడంతో ఆ పరిశ్రమ పొరుగురాష్ట్రానికి తరలిపోయిందని తెలిపారు. తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో హిందూపురం ఎంపి గోరంట్ల మాధవ్ కియా ప్రతినిధులను ఇదేవిధంగా బెదిరించారని గుర్తుచేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.





నాలుగుసార్లు టైటిల్ విజేత జర్మనీకి

జపాన్ ఝలక్

రెండుసార్లు టైటిల్ విజేత అర్జెంటీనాజట్టుకు ఆసియా ఖండానికి చెందిన సౌదీ అరేబియా జట్టు ఝలక్ ఇచ్చి 24గంటలు గడవకముందే.. ఫిఫా ప్రపంచకప్‌లో మరో సంచలనం నమోదైంది. బుధవారం ఉత్కంఠభరితంగా సాగిన గ్రూప్-ఇ లీగ్ మ్యాచ్‌లో ఆసియా ఖండానికే చెందిన మరో జట్టు జపాన్ నాలుగుసార్లు ఫిఫా టైటిల్ విజేత జర్మనీ జట్టును ఓడించి మరో సంచలనానికి తెరలేపింది.

దోహా: ఫిఫా ప్రపంచకప్-2022లో సంచలనాలు నమోదువుతున్నాయి. సౌదీ అరేబియా జట్టు అర్జెంటీనాపై సంచలన విజయం సాధించిన విషయం మరువక ముందే.. ఆసియా ఖండానికి చెందిన మరోజట్టు జపాన్ 4సార్లు టైటిల్ విజేత జర్మనీ జట్టుకు చెక్ పెట్టింది. బుధవారం రాత్రి ఉత్కంఠభరితంగా సాగిన పోటీలో జపాన్ జట్టు 2-1 గోల్స్ తేడాతో 2014 ఫిఫా టైటిల్ విజేత జర్మనీపై సంచలన విజయం సాధించింది. జర్మనీ ఆటగాడు లికాయ్ గుండెగాన్ తొలి అర్ధభాగం 33వ నిమిషంలో ఒక గోల్ కొట్టడంతో ఆ జట్టు 1-0 ఆధిక్యతలో నిలిచింది. అదే ఆధిక్యతను 75 నిమిషాలవరకు కొనసాగించినా.. జపాన్‌కు స్ట్రయికర్ రిట్సూ డాన్ ఒక గోల్ కొట్టడంతో ఇరుజట్లు 1-1తో సమంగా నిలిచాయి. అదే ఊపులో జపాన్‌కు చెందిన టకుమ అసానో(83వ ని.) మరో గోల్ కొట్టడంతో ఆ జట్టు 2-1 గోల్స్ ఆధిక్యతలోకి దూసుకెళ్లింది. దీంతో ఒక్కసారిగా షాక్‌కు గురైన జర్మనీ ఆటగాళ్లు జపాన్ గోల్‌పోస్ట్‌పై ఎదురు దాడికి దిగారు. నిర్ణీత సమయం ముగిసే సరికి మరో గోల్ చేయడంలో విఫలమైన జర్మనీ ఆటగాళ్లు.. 7 నిమిషాల అదనపు సమయంలోనూ గోల్ చేయలేకపోయారు. జపాన్ డిఫెండర్లు సమర్ధవంతంగా బంతిని గోల్‌పోస్ట్‌కు బయటకు తరలించడంతో జపాన్‌కు విజయం ఖాయమైంది. జర్మనీ జట్టుపై జపాన్ గెలుపొందడంతో ఫుట్‌బాల్ చరిత్రలో ఇదే తొలిసారి. జర్మనీ జట్టు 2014లో చివరిసారిగా ఫిఫా టైటిల్‌ను గెలుపొందగా.. దానికి ముందు 1990, 1974, 1954లో మూడుసార్లు టైటిల్‌ను ఫిఫా టైటిల్‌ను కైవసం చేసుకుంది.

ఫ్రాన్స్ చేతిలో ఆస్ట్రేలియా చిత్తు



డిఫెండింగ్ ఛాంపియన్, రెండుసార్లు ఫిఫా ప్రపంచకప్ టైటిల్ విజేత ఫ్రాన్స్ జట్టు 4-1 గోల్స్ తేడాతో ఆస్ట్రేలియాను చిత్తుచేసింది. గ్రూప్-డి లీగ్ పోటీలో ఫ్రాన్స్ ఆటగాడు ఒలివియర్ గిరోడ్ 2గోల్స్‌తో మెరిసాడు. ఎసి మిలాన్ స్ట్రయిర్ బాలన్ డి ఓర్, కరీమ్ బెంజెమా ఒలివియర్ సహకారంతో ఒలివియర్ ఈ గోల్స్ చేశాడు. 19ఏళ్ల ఫ్రాన్స్ యువ ఆటగాడు కైలియన్ మాపే ఒక గోల్ కొట్టగా.. మ్యాచ్ ముగియడానికి కొద్ది నిమిషాల ముందు మరో గోల్ చేయడంతో ఫ్రాన్స్ తిరుగులేని 4-1 గోల్స్ ఆధిక్యతను సంపాదించింది. మ్యాచ్ ప్రారంభమైన 9వ నిమిషంలోనే ఆస్ట్రేలియా తరపున క్రెగ్ గుడ్‌విన్ ఒక గోల్ కొట్టడంతో ఆ జట్టు 1-0 ఆధిక్యతలో నిలిచింది.

పోలండ్-మెక్సికో, మొరాకో-క్రొయేషియా మ్యాచ్‌లు డ్రా

గ్రూప్-సిలో మెక్సికో-పోలండ్‌ల జట్ల మధ్య, గ్రూప్-ఎఫ్‌లో మొరాకో- క్రొయేషియా జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లు డ్రా అయ్యాయి. నిర్ణీత సమయం పూర్తయ్యే సమయానికి ఏ జట్టూ ఒక్క గోల్ కూడా నమోదు చేయకపోవడంతో 0-0తో ఈ రెండు మ్యాచ్‌లు డ్రా అయ్యాయి. దీంతో నాలుగుజట్లకు ఒక్కో పాయింట్ దక్కాయి.

ఫిఫా ప్రపంచకప్‌లో నేడు...

గ్రూప్-జి: స్విట్జర్లాండ్ x కామరూన్(మ.3.30గం॥లకు)
గ్రూప్-హెచ్: ఉరుగ్వే x ద.కొరియా(రా.6.30గం॥లకు)
పోర్చుగల్ x ఘనా(రా.9.30గం॥లకు)
గ్రూప్-జి: బ్రెజిల్ x సెర్బియ(రా.12.30గం॥లకు)

ఆంధ్ర జట్టు ఓటమి.. విజయ్ హజారే వన్డే టోర్నీ

బెంగళూరు: విజయ్ హజారే వన్డే టోర్నమెంట్ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు పరాజయాన్ని చవిచూసింది. బుధవారం జరిగిన ఎలైట్ గ్రూప్-సిలో ఆంధ్రజట్టు 8వికెట్ల తేడాతో ఛత్తీస్‌గఢ్ జట్టు చేతిలో ఓడింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్ర 42.3ఓవర్లలో 144పరుగులకే కుప్పకూలింది. నితీశ్ కుమార్(50), అభిషేక్ రెడ్డి(29), ఆశ్విన్ హెబ్బర్(23)మాత్రమే బ్యాటింగ్‌లో రాణించారు. ఛత్తీస్‌గఢ్ బౌలర్లు సుమిత్ రూకర్(4/23), శుభమ్ అగర్వాల్(3/50), రవి కిరణ్(2/26) బౌలింగ్‌లో మెరిసారు. ఛేదనలో హర్‌ప్రీత్ సింగ్ భాటియా(65నాటౌట్), అమన్‌దీప్(35నాటౌట్) బ్యాటింగ్‌లో రాణించడంతో 26.3ఓవర్లలోనే ఆ జట్టు లక్ష్యాన్ని ఛేదించింది. గిరినాథ్, షోయబ్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. బుధవారంతో ముగిసిన గ్రూప్ లీగ్‌ల అనంతరం ఆంధ్రజట్టు 7మ్యాచుల్లో 4విజయాలు, 2పరాజయాలు, ఒక డ్రాతో సహా 18పాయింట్లతో 3వ స్థానంలో నిలిచింది. తమిళనాడు(24పాయింట్లు), కేరళ(20పాయింట్లు) టాప్-2లో నిలిచి నేరుగా ప్రి క్వార్టర్స్‌కు అర్హత సాధించగా.. మిగతా గ్రూప్‌ల సమీకరణాలను బట్టి ఆంధ్రప్రదేశ్‌జట్టు ప్రి క్వార్టర్స్‌కు చేరేది లేనిది తేలిపోనుంది.

హైదరాబాద్ గెలుపు..

ఎలైట్ గ్రూప్-ఏలో హైదరాబాద్ జట్టు 110పరుగుల తేడాతో ఛండీగర్‌పై విజయం సాధించింది. హైదరాబాద్ జట్టు 50 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 306పరుగులు చేయగా.. ఛేదనలో ఛత్తీస్‌గఢ్ జట్టు 46.3 ఓవర్లలో 196పరుగులకే కుప్పకూలింది. ఈ గ్రూప్‌లో హైదరాబాద్ జట్టు 20 పాయింట్లతో మూడోస్థానంలో నిలిచింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68